విద్యా సంస్థలకు సెలవు

విశాఖపట్నం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో ముందస్తు జాగ్రత్తగా జిల్లాలో సోమ, మంగళవారాల్లో అన్ని యాజమాన్య పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలలు, అగన్‌వాడీ కేంద్రాలకు కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్ సెలవు ప్రకటించారు. జిల్లా, మండల విద్యాశాఖ కార్యాలయాల్లో కంట్రోల్‌రూమ్‌లు ఏర్పాటుచేస్తున్నట్టు డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్ తెలిపారు. అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తాళాలతో అందుబాటులో ఉండి, ప్రజలను సమీపంలోని పాఠశాలలకు తరలించే సమయంలో కంప్యూటర్లు, డిజిటల్ బోర్డులు, ఫ్యానళ్ల జాగ్రత్త చేసుకోవాలన్నారు.

టీచర్లకూ టెట్

సుప్రీంకోర్టు తీర్పు అమలుకు ప్రభుత్వ నిర్ణయం

- ఈ మేరకు నోటిఫికేషన్ విడుదల
- 2014కు ముందు విధుల్లో చేరిన వారికి వర్తింపు
- ఐదేళ్లలో రిటైరయ్యే వారికి మినహాయింపు
- ఉమ్మడి జిల్లాలో పది వేల మందికి పరీక్ష
- రివ్యూ పిటిషన్ వేయాలంటున్న ఉపాధ్యాయ సంఘాలు

విశాఖపట్నం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి):



ఉపాధ్యాయులు (ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న వారు) కూడా 'ఉపాధ్యాయ అర్హత పరీక్ష' (టీచర్ ఎలిజబిలిటి టెస్ట్-టెట్)లో అర్హత సాధించాలని సుప్రీంకోర్టు ఇచ్చి న తీర్పును అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి అనుగుణంగా తాజాగా నోటిఫికేషన్ విడుదల చేయడంతో ఉపాధ్యాయుల్లో అలజడి మొదలైంది.

టెట్‌కు వచ్చే నెల 23వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, డిసెంబరు 10న పరీక్ష నిర్వహిస్తామని పాఠశాల విద్యా శాఖ పేర్కొంది. 2014 కంటే ఉద్యోగంలో చేరిన వారంతా టెట్‌లో అర్హత సాధించాల్సి ఉంది. అయితే 2030 ఆగస్టు 31లోగా ఉద్యోగ విరమణ చేయనున్న వారు, 1968 ఆగస్టు 31లోగా పుట్టిన వారు టెట్ రాయాల్సిన అవసరం లేదు. రెండేళ్లలో టెట్‌లో అర్హత సాధించాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు అమలుపై ఉపాధ్యాయుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. డీఎస్సీలో మెరిట్ సాధించి విధుల్లో చేరిన పదిహేనేళ్ల తరువాత టెట్ రాయడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. సుప్రీంకోర్టు తీర్పును తమిళనాడు, కేరళ తదితర రాష్ట్రాలు పక్కనపడేశాయని, ఈ విషయంలో ఏపీ ప్రభుత్వం పునరాలోచించాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.

గణితం టీచర్‌కు బయాలజీ పరీక్ష

టెట్‌లో రెండు భాగాలు...లెవెల్ 1, 2 పేపర్లు ఉంటాయి. ప్రాథమిక పాఠశాలల్లో బోధించే టీచర్లు అన్ని సబ్జెక్టులతో కూడిన లెవెల్-1 పరీక్ష రాయాలి. ఉన్నత పాఠశాలల విద్యార్థులకు బోధించే వారు లెవెల్-2 పరీక్ష రాయాలి. ఇందులో గణితం/సైన్స్ ఒక పేపర్ కాగా ఆర్ట్/లాంగ్వేజెస్‌తో మరో పేపర్ ఉంటుంది. ప్రతి పేపర్ 150 మార్కులకు ఇస్తారు. గణితం/సైన్స్, తెలుగు భాషపై అవగాహన, కంప్యూటర్ నైపుణ్యం, సైకాలజీ సబ్జెక్టుల నుంచి ప్రశ్నలు తయారుచేస్తారు. గణితం స్కూలు అసిస్టెంట్‌కు గణితం, భౌతికశాస్త్రంపై అవగాహన ఉంటుంది తప్ప జీవశాస్త్రంతో సంబంధం ఉండదు. బయాలజీ టీచర్ గణితంపై ప్రశ్నలకు జవాబులు రాయలేరు. సోషల్ టీచర్‌కు తెలుగు, ఇంగ్లీష్ ... మిగతా 6వ పేజీలో

ముంచుకొస్తున్న మొంథా

కుంభవృష్టి వర్షాలు కురిసే అవకాశం

- తుఫాన్ నేపథ్యంలో యంత్రాంగం అప్రమత్తం
- కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు
- నేటి ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు



విశాఖపట్నం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి):

మొంథా తుఫాన్ ముంచుకొస్తుండడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఈ మేరకు జిల్లా యంత్రాంగం అలర్ట్‌గా ఉండాలని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. తుఫాన్ నేపథ్యంలో సోమవారం ఉదయం నుంచి క్షేత్రస్థాయిలో పర్యటించి అధికారులు, సిబ్బందితో సమావేశాలు ఏర్పాటుచేయాలన్నారు. తుఫాన్‌ను ఎదు ర్కొనేందుకు మండల, నియోజకవర్గాల ప్రత్యేకాధికారులు అన్ని విధాలా సన్నద్ధంగా ఉండాలన్నారు.

జేసీబీలు, ఇతర యంత్రాలు, తుఫాన్ షెల్టర్లు సిద్ధంచేయాలని, ప్రతి చోటా కనీస వసతులు కల్పించాలన్నారు. ప్రధానంగా తాగునీరు, మందులు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. కొండవాలు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలను అప్రమత్తంచేయాలని, అక్కడ ఏదైనా ప్రమాదం జరిగితే యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలన్నారు. క్షేత్రస్థాయి సమస్యలను మధ్యాహ్నం 12 గంటలకు కలెక్టరేట్‌లో నిర్వహించనున్న సమావేశంలో నివేదించాలన్నారు. ప్రతి ఒక్కరు సోమవారం ఉదయం మండల, నియోజకవర్గ కేంద్రాలకు చేరుకుని అధికారులు, సిబ్బందిని అప్రమత్తంచేయాలని ఆదేశించారు. తుఫాన్ నేపథ్యంలో కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి సిబ్బందిని నియమించారు. షిఫ్టుల వారీగా పనిచేసేలా చర్యలు తీసుకున్నారు.

వాల్తేరు రైల్వే ముందస్తు చర్యలు

తుఫాన్‌ను దృష్టిలో ఉంచుకుని వాల్తేరు రైల్వే ముందస్తు భద్రత చర్యలు చేపట్టింది. ప్రయాణికుల కోసం విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం రోడ్డు, దువ్వాడ, రాయగడ స్టేషన్లలో హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేశారు. రద్దైన రైళ్లకు సంబంధించిన టికెట్ల సొమ్ము వాపసు ఇచ్చేందుకు అదనపు కౌంటర్లు ఏర్పాటు చేశారు. క్యాటరింగ్ యూనిట్లు, ప్రాథమిక చికిత్సల కోసం వైద్య సిబ్బందితోపాటు అంబులెన్స్‌లు అందుబాటులో ఉంచారు. సివిల్ డిఫెన్స్, స్కౌట్స్ అండ్ గైడ్స్ వలంటీర్లను అప్రమత్తం చేశారు. ప్రయాణికుల కోసం అవసరమైతే ప్రత్యేక రైళ్లను నడపడానికి రేక్‌లు సిద్ధం చేశారు. రైల్వే వంతెనలు, ట్రాక్‌లు, యార్డులు, సిగ్నలింగ్ వ్యవస్థ నిర్వహణపై నిరంతర నిఘా ఉంచారు. నీరు నిల్వ చేరే ప్రాంతాల్లో క్లీన్ చేయడంతోపాటు వృక్షాలు, శిథిలాలను తొలగించేందుకు రంగం సిద్ధం చేశారు. ప్రమాద ప్రదేశాల్లో పెట్రోలింగ్‌కు వాచ్‌మెన్లను నియమించారు. రైల్వే కార్యకలాపాలు సజావుగా జరిగేలా చర్యలు చేపట్టేందుకు సిద్ధంగా ఉండాలని డీఆర్ఎం లలిత్ బొహ్రా అధికారులను ఆదేశించారు.

జీవీఎంసీలో కంట్రోల్‌రూమ్ ఏర్పాటు

మొంథా తుఫాన్ నేపథ్యంలో ఎలాంటి పరిస్థితి ఎదురైనా సమర్థంగా ఎదుర్కొనేలా కమిషనర్ కేతన్‌గార్గ్ కార్యాచరణ రూపొందించారు. ప్రజలకు ఏదైనా సహాయం అవసరమైతే తక్షణం అందేలా జీవీఎంసీలో కంట్రోల్‌రూమ్‌ను ఏర్పాటుచేశారు. 24 గంటలు సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు. కొండవాలు, లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని జోనల్ కమిషనర్లు, వార్డు సచివాలయ కార్యదర్శులను ఆదేశించారు. ప్రతీజోనల్ కార్యాలయంలో కంట్రోల్‌రూమ్‌తోపాటు సమాచారం అందుకునేందుకు వీలుగా సిబ్బందిని నియమించారు. వర్షం, గాలివాన సమయంలో విద్యుత్‌స్తంభాలు, చెట్లు, హోర్డింగ్‌లు, పురాతనభవనాలు కూలిపోయే ప్రమాదం ఉండడంతో ప్రజలు జాగ్రత్తగా ఉండేలా హెచ్చరికలు జారీచేయాలని అధికారులను ఆదేశించారు. వరదనీటి ప్రవాహం సాగిపోయేందుకు వీలుగా గెడ్డల్లో చెత్త, ఇతర వ్యర్థాలను వేయకుండా అవగాహన కల్పించాలని ప్రజారోగ్యవిభాగం అధికారులను ఆదేశించారు. తుఫాన్‌కు సంబంధించిన సమాచారం ప్రజలకు ఎప్పటికప్పుడు చేరవేయడంతోపాటు సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు సమాచారంతో ఆందోళనకు గురవకుండా చూడాలన్నారు.



సాగర తీరంలో పరిస్థితులను పరిశీలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

నేడు పీజీఆర్ఎస్ రద్దు

తుఫాన్ ప్రభావంతో సోమవారం జరగాల్సిన ప్రజా ఫిర్యాదుల పరిష్కారవేదిక (పీజీఆర్ఎస్) రద్దుచేసినట్టు ... మిగతా 6వ పేజీలో

నేడు, రేపు రెడ్ అలర్ట్

తీవ్ర వాయుగుండం ప్రభావంతో సోమ, మంగళవారాల్లో జిల్లాకు రెడ్ అలర్ట్ ప్రకటించారు. కాగా ఆదివారం రాత్రి నగరం, పరిసరాల్లో మోస్తరు వర్షం కురిసింది. సోమవారం మధ్యాహ్నం తరువాత సముద్రం నుంచి మేఘాలు నగరంపైకి ఆవరించే అవకాశం ఉంది. దీంతో వర్షాలు పెరుగుతాయి. అక్కడక్కడా భారీ వర్షం కురుస్తుందని వాతావరణశాఖ తెలిపింది. సోమవారం రాత్రికి వర్షాలు పెరిగి మంగళవారం నుంచి భారీ నుంచి అతిభారీ, అక్కడక్కడా అత్యంత భారీ వర్షం పడుతుందని పేర్కొంది. మంగళవారం రాత్రి తుఫాన్ తీరం దాటనున్నందున ఉదయం నుంచి గాలుల వేగం పెరుగుతుందని, బుధవారం వరకు భారీ వర్షాలు, గాలుల ప్రభావం కొనసాగుతుందని వాతావరణశాఖ తెలిపింది.

బీచ్‌ల మూసివేత

సాగర్‌నగర్/ భీమునిపట్నం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ నేపథ్యంలో రుషికొండ, భీమిలి సహా పలు బీచ్‌ను ఆదివారం నుంచి మూసివేశారు. ముందస్తు చర్యల్లో భాగంగా ఏపీ టూరిజం, మెరైన్ పోలీసులు బారికేడ్లను ఏర్పాటుచేశారు. సెలవు దినం కావడంతో అధికసంఖ్యలో వచ్చిన సందర్శకులను వెనక్కి పంపేశారు. రుషికొండలో బోటుషికార్‌ను నిలిపివేసి, బోట్లను సురక్షిత ప్రాంతాలకు తరలించారు.



రుషికొండ బీచ్ వద్ద ఏర్పాటుచేసిన బారికేడ్లు

పోరు ఉధృతం

నేడు విజయవాడలో ఎన్టీఆర్ ఆరోగ్య సేవ నెట్‌వర్క్ ఆస్పత్రుల అసోసియేషన్ సమావేశం

- సమ్మెపై కీలక నిర్ణయం తీసుకునే అవకాశం
- ఇప్పటికే 17 రోజులుగా నిలిచిపోయిన వైద్య సేవలు
- విరమించే యోచనలో పలు ఆస్పత్రుల యాజమాన్యాలు



విశాఖపట్నం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి):

ఎన్టీఆర్ వైద్య సేవ నెట్‌వర్క్ పరిధిలోని ఆస్పత్రులు గత 17 రోజులుగా సమ్మెలో ఉన్నాయి. ఇప్పటివరకు యాజమాన్యాలతో ప్రభుత్వం పూర్తిస్థాయి చర్చలు జరపలేదు. ఈ నేపథ్యంలో నెట్‌వర్క్ ఆస్పత్రుల అసోసియేషన్ సమ్మెను ఉధృతం చేయాలని భావిస్తోంది. ఈ మేరకు సోమవారం విజయవాడలో అసోసియేషన్ జనరల్ బాడీ మీటింగ్ నిర్వహించి, కీలక నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని చెబుతున్నారు.

ఆరోగ్యశ్రీలో భాగంగా ఆస్పత్రులు ఇప్పటివరకు కొత్త రిజిస్ట్రేషన్స్‌ను నిర్వహిం చడం లేదు. ఇప్పటికే చికిత్స పొందుతున్న కేన్సర్, కిడ్నీ రోగులకు సేవలంది స్తున్నారు. వీటిని కూడా నిలిపివేసి, ప్రభుత్వంపై ఒత్తిడి పెంచే యోచనలో ఉన్నట్టు చెబుతున్నారు. దీనిపై సోమవారం నిర్ణయం తీసుకుంటారని సమాచారం.

సీఎం హామీ కోసం

ఇదిలా ఉండగా వీలైనంత త్వరగా ఆస్పత్రులు సమ్మె విరమించేలా ప్రభు త్వం ప్రయత్నిస్తోంది. ఇప్పటికే ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అసోసియేషన్ ప్రతి నిధులతో సంప్రదింపులు జరిపారు. విదేశాల్లో ఉన్న సీఎం చంద్రబాబు రాష్ట్రానికి వచ్చిన వెంటనే బకాయిలు విడు దల చేసేలా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చినట్టు తెలుస్తోంది. అయితే సీఎం నుంచి హామీ ... మిగతా 6వ పేజీలో

ఆర్టీసీ అలర్ట్

కర్నూలు బస్సు ప్రమాదంతో అధికారుల అప్రమత్తం

- విశాఖ రీజియన్ పరిధిలో బస్సుల పరిశీలన
- ఏసీ బస్సుల డ్రైవర్లకు వైద్య పరీక్షలు



అమరావతి ఏసీ బస్సులో తనిఖీలు చేస్తున్న ఆర్టీసీ అధికారులు.

ద్వారకాబస్‌స్టేషన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి):

కర్నూలు జిల్లాలో ప్రైవేటు ట్రావెల్స్ బస్సు అగ్ని ప్రమాదానికి గురై 19 మంది ప్రయాణికులు సజీవ దహనమైన నేపథ్యంలో ఆర్టీసీ అధికారులు అప్రమత్తమయ్యారు. విశాఖ రీజియన్‌లోని ఏసీ బస్సులను మెకానికల్, ఎలక్ట్రికల్, ఇంజినీర్లు, ఫైర్ అండ్ సేఫ్టీ విభాగం అధికారులు, హైడ్రాలిక్ సాంకేతికత సిబ్బంది పరిశీలించారు. రీజనల్ మేనేజర్, డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజినీర్ వాటి పనితీరును గమనించారు. అత్యవసర ద్వారాలు, ప్రతి గ్లాస్ దగ్గర ఒక ఇనుప సుత్తి ఉన్నదీ లేనిదీ గుర్తించారు. మంటలను అదుపు చేసేందుకు ఏర్పాటు చేసిన ఎస్టింగ్విషర్లు బాగున్నాయని సంతృప్తి చెందిన తరువాతే రవాణాకు వినియోగించారు. ఆదివారం మధ్యాహ్నం నుంచి రాత్రివరకూ విశాఖపట్నం డిపోలో ఈ కార్యక్రమం కొనసాగింది.

రీజియన్‌లో అమరావతి 4, గరుడ 4, గరుడ ప్లస్ 6, నైట్ రైడర్ 2, డాల్ఫిన్ క్రూయిజ్ 2, మెట్రోలగ్జరీ 16 బస్సులున్నాయి. మెట్రో లగ్జరీ మినహా హైదరాబాద్, విజయవాడ, తిరుపతి, చెన్నై, బెంగళూరు, భువనేశ్వర్ వంటి ప్రాంతాలకు రవాణా సేవలందిస్తున్నాయి. మెట్రోలగ్జరీలు ... మిగతా 6వ పేజీలో

పెందుర్తి వీఆర్వోపై దాడి

ఆక్రమణలు తొలగించే క్రమంలో దుశ్చర్య

- ముగ్గురిని అదుపులోకి తీసుకొని, కేసు నమోదు చేసిన పోలీసులు



వీఆర్వో ఆనంద్‌కుమార్‌పై దాడి చేస్తున్న దృశ్యం

పెందుర్తి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వ భూమిలో ఆక్రమణలను తొలగించేందుకు వెళ్లిన వీఆర్వోపై అక్రమార్కులు దాడికి పాల్పడ్డారు. ఈ సంఘటన పెందుర్తిలో ఆదివారం రాత్రి జరిగింది. బాధిత వీఆర్వో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. పెందుర్తి సీఐ కేవీ సతీశ్‌కుమార్, వీఆర్వో తెలిపిన వివరాల మేరకు...

పెందుర్తి సమీపంలోని గోకాడ సర్వే నంబరు 231/1లో గల ప్రభుత్వ చెరువు స్థలంలో కొంతమంది ఆక్రమణలకు పాల్పడ్డారు. నిర్మాణానికి బేస్‌మెంట్ తీశారు. దీనిపై అందిన ఫిర్యాదుమేరకు ఆక్రమణలు తొలిగించాలని తహసీల్దార్ ఇంటి వెంకట అప్పారావు ఆదేశించారు. ఈ మేరకు పెందుర్తి వీఆర్వో ఆనంద్‌కుమార్. అతనికి సహాయంగా మరో వీఆర్వో పృథ్వీ ఆక్రమిత చెరువు స్థలం వద్దకు ఆదివారం రాత్రి చేరుకున్నారు. బేస్‌మెంట్‌పై గల ఇటుకలు తొలగిస్తుండగా, ఆరుగురు వ్యక్తులు అక్కడికి వచ్చి వాగ్వాదానికి దిగారు. ఉన్నతాధికారుల ఆదేశం మేరకు ఆక్రమణలు తొలగిస్తున్నామని సమాధానం ఇవ్వడంతో వారంతా తీవ్ర ఆగ్రహంతో వీఆర్వో ఆనంద్‌కుమార్‌పై మూకుమ్మడిగా దాడికి పాల్పడ్డారు. పిడిగుద్దులతో గాయపరిచారు. పక్కనే ఉన్న మరో వీఆర్వో పృథ్వీ వారిని అడ్డుకునేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. వీఆర్వోపై దాడి జరుగుతోందనే సమాచారంతో అప్రమత్తమైన రెవెన్యూ సిబ్బంది పోలీసులకు కాల్ చేయడంతో వారు ఘటనాస్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. విధుల్లో ఉన్నత తనపై ఆక్రమణదారులు దాడికి పాల్పడ్డారని బాధిత ... మిగతా 6వ పేజీలో

ఇంగ్లండ్ జోరు

అమీ జోన్స్ అజేయ అర్ధ సెంచరీ

- ఎనిమిది వికెట్ల తేడాతో విజయం
- చివరి మ్యాచ్‌లోనూ న్యూజిలాండ్‌కు తప్పని ఓటమి

విశాఖపట్నం, స్పోర్ట్స్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి):

మహిళల వన్డే ప్రపంచ కప్ టోర్నీలో భాగంగా ఆదివారం ఇక్కడి ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో ఇంగ్లండ్ ఎనిమిది వికెట్ల తేడాతో న్యూజిలాండ్‌ను ఓడించింది. ఏకపక్షంగా సాగిన మ్యాచ్‌లో డిఫెండింగ్ రన్నరప్ ఇంగ్లండ్...పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. ఇంగ్లండ్ ఓపెనర్లు అమీ జోన్స్ (86 నాటౌట్; 11 ఫోర్లు, 1 సిక్సర్), టామీ బ్యూమౌంట్ (40; 7 బౌండరీలు) తొలి వికెట్‌కు 75 పరుగుల భాగస్వామ్యంతో జట్టుకు సునాయాస విజయాన్నందించారు. న్యూజిలాండ్ నిర్దేశించిన 169 పరుగుల లక్ష్యాన్ని ... మిగతా 6వ పేజీలో



అమీ జోన్స్ (86 నాటౌట్)



న్యూజిలాండ్ కెప్టెన్‌కు వీడ్కోలు

సోఫీ డివైన్‌కు ప్రశంసాపత్రం అందించిన కలెక్టర్

విశాఖపట్నం, స్పోర్ట్స్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి):

న్యూజిలాండ్ కెప్టెన్ సోఫీ డివైన్ ఆదివారం తన కెరీర్‌కు రిటైర్‌మెంట్ ప్రకటించింది. దీంతో ఆమెకు రెండు జట్ల ఆటగాళ్లు మైదానంలో ఘన వీడ్కోలు పలికారు. ఈ నేపథ్యంలో ఆంధ్ర క్రికెట్ సంఘం (ఏసీఏ) తరఫున కలెక్టర్ హరీంధర ప్రసాద్ ప్రశంసాపత్రాన్ని అందజేశారు. మహిళల వన్డే ప్రపంచ కప్ టోర్నీలో ఆదివారం ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో ఇంగ్లండ్‌తో జరిగిన చివరి లీగ్ మ్యాచ్ అనంతరం న్యూజిలాండ్ జట్టు సభ్యులతోపాటు ఇంగ్లండ్ క్రికెటర్లు కెప్టెన్ సోఫీ డివైన్‌కు ఘన వీడ్కోలు పలికారు. ఇప్పటి వరకు 159 వన్డేలు, 146 టీ-20 మ్యాచ్‌లు ఆడిన ఆడింది. మ్యాచ్ ముగిసిన అనంతరం రిటైర్‌మెంట్‌ను ప్రకటిస్తూ కన్నీరు పెట్టింది. విశాఖలో చివరి మ్యాచ్ ఆడిన నేపథ్యంలో ఏసీఏ ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికింది.

పెట్టుబడిదారుల సదస్సుకు నగరం ముస్తాబు

జోరుగా సుందరీకరణ పనులు

విశాఖపట్నం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి):

నగరం వేదికగా వచ్చేనెల 14,15 తేదీల్లో జరగనున్న పారిశ్రామిక పెట్టుబడిదారుల భాగస్వామ్య సదస్సు (సీఐఐ)కు నగరం సర్వాంగ సుందరంగా ముస్తాబవుతోంది. సదస్సు జరిగే పరిసరాలతోపాటు హాజరయ్యే ప్రతినిధులు ప్రయాణించే మార్గాల్లో సుందరీకరణ పనులు జోరుగా సాగుతున్నాయి.

బీచ్‌రోడ్డు పార్కుహోటల్ జంక్షన్ నుంచి ఫిషింగ్‌హార్బర్ వరకు సెంటర్ మీడియన్లకు, ఐరన్‌గ్రిల్స్‌కు ఆకట్టుకునేలా రంగులతో తీర్చిదిద్దుతున్నారు. ఫుట్‌పాత్‌లు, డివైడర్లను ముస్తాబు చేస్తున్నారు. సెంటర్ మీడియన్లు, రోడ్డుకి ఇరువైపులా ఉన్న గ్రీన్ డెక్ట్‌లో మనసును పులకరింజేసేలా పూల మొక్కలను నాటుతున్నారు. బీచ్‌రోడ్డులో ప్రయాణించే వారికి పచ్చదనం కనువిందు చేసేలా జీవీఎంసీ హార్టీకల్చర్ ఆధ్వర్యంలో గ్రీనరీని అభివృద్ధి చేస్తున్నారు. పార్కుహోటల్ జంక్షన్‌లోని రెండు సర్కిళ్లలో రంగులు వెలిసిపోయిన కళాఖండాలకు కొత్తగా రంగులు వేయడంతో ఆకట్టుకుంటున్నాయి. సిరిపురం కూడలి నుంచి దత్‌ఐలాండ్, త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ మీదుగా ... మిగతా 6వ పేజీలో





పార్క్ హోటల్ జంక్షన్ వద్ద అందమైన కళాకృతులు (ఇన్‌సెట్‌లో) సంపత్ వినాయక గుడి వద్ద ప్రతిరూపం



సందీప్‌కు శుభాకాంక్షలు చెబుతున్న జన సైనికులు

ఘనంగా సందీప్ జన్మదిన వేడుకలు

ఎండాడ అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : జనసేన నియోజకవర్గం ఇన్‌చార్జి, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి డైరెక్టర్ పంచకర్ల సందీప్ జన్మదిన వేడుకలు ఎండాడలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఘనంగా జరిగాయి. ఆ పార్టీ 8వ వార్డు అధ్యక్షుడు శాఖరీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలకు నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

అనంత పద్మనాభుడికి పూజలు

పద్మనాభం : పద్మనాభంలోని అనంత పద్మనాభుడ్ని పంచకర్ల సందీప్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కొండపై ఉన్న పద్మనాభుడిని, దిగువ ఉన్న కుంతీమాధవస్వామిని దర్శించుకున్నారు. అర్చకులు ఆయనకు స్వాగతం పలికారు. కుంతీమాధవస్వామి ఆలయంలో లక్ష్మీదేవి దర్శనం అనంతరం పండితులు వేదాశీర్వచనం చేశారు.అనంతరం మూడు మండలాల నుంచి వచ్చిన జన సైనికులు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు కె. లక్ష్మి, ఎర్నాయుడు దంపతులు, టీఎస్ఎస్ఎఫ్ భీమిలి నియోజకవర్గం అధ్యక్షుడు సుమంత్, భీమిలి ఏఎంసీ ఛైర్మన్ కె. రామస్వామినాయుడు, బూత్ ఇన్‌ఛార్జి శాకరి శ్రీనుబాబు, నాయకులు కృష్ణయ్య, వీబీ నాయుడు, మండల ఉపాధ్యక్షుడు పి. సారధి, వేములవలస పీఏసీఎస్ ఛైర్మన్ నాగరాజు, సంతోష్, సూరప్పడు, రమణ, అప్పలరాజు, రాము, మహేశ్ పాల్గొన్నారు.

కుంతీమాధవస్వామికి ప్రత్యేక పూజలు

పద్మనాభం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : పద్మనాభంలోని కుంతీ మాధవస్వామిని గుజరాత్ రాష్ట్రానికి చెందిన ఇస్కాన్ భక్తులు ఆదివారం దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో భజనలు చేశారు. ఆలయ విశేషాలను అర్చకులు పి.రామాచార్యులు చెప్పగా విశాఖపట్నం ఇస్కాన్‌కు చెందిన ప్రతినిధి వారికి హిందీలో తర్జుమా చేశారు. సుమారు 130 మంది భక్తులు నాలుగు బస్సుల్లో స్వామివారి దర్శనానికి వచ్చారు.

భీమిలి బీచ్‌ను సందర్శించిన అరకు ఎమ్మెల్యే

భీమునిపట్నం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) :భీమిలి బీచ్‌ను అరకు ఎమ్మెల్యే ఆర్. మత్స్యలింగం ఆదివారం సాయంత్రం సందర్శించారు. తెలంగాణలోని వరంగల్ జిల్లాకు చెందిన తన స్నేహితులతో కలిసి ఆయన బీచ్‌కు వచ్చారు. తుపాను హెచ్చరికల నేపథ్యంలో పోలీసులు సందర్శకులను బీచ్‌లోకి అనుమతించడం లేదు. ఎమ్మెల్యే, తాము సుదూర ప్రాంతం నుంచి వచ్చామని, తీరంలో ఒక ఫొటో తీసుకుంటే గుర్తుగా ఉంటుందని మెరైన్ సీఐ శ్రీనివాసరావును కోరడంతో ఆయన అంగీకరించారు.

కెమెరా చోరీ చేసిన నిందితుడి అరెస్టు

కొమ్మాది, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : పీఎంపాలెం క్రికెట్ స్టేడియంలో ఆగస్టు 23న జరిగిన ఏపీఎల్ ఫైనల్ మ్యాచ్ కవర్ చేస్తున్న కోమరెడ్డి ఫణిచేతన్ సోనీ కెమేరా, లెన్స్ చోరీకి గురయ్యాయి. ఈమేరకు ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. గాండీవం యాప్ ద్వారా నిందితుడు హుస్సేన్‌ను గుర్తించి విచారించగా నేరం అంగీకరించినట్టు జోన్-1 నేర విభాగం ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి తెలిపారు. నిందితుడు కర్ణాటక రాష్ట్రం రాయచూరుకు చెందిన వాడు కాగా భోగాపురంలో అదుపులోకి తీసుకున్నామన్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో నిందితుడ్ని పట్టుకున్న పీఎంపాలెం పోలీసులను ఏసీపీ అభినందించారు.

అలరించిన శాస్త్రీయ నృత్యాలు

మధురవాడ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : వారాంతపు వినోద కార్యక్రమాల్లో భాగంగా శిల్పారామంలో నగరానికి చెందిన రాజరాజేశ్వరి డ్యాన్స్ అకాడమీ విద్యార్థులు ఆదివారం కూచిపూడి, జానపద నృత్యాలు ప్రదర్శించారు. చిన్నారులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి.

వృద్ధులకు ఉచిత నేత్ర వైద్య పరీక్షలు

మధురవాడ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) :మధురవాడలోని శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రిలో వచ్చే నెల 1 నుంచి డిసెంబరు 31వ తేదీ వరకు సీనియర్ సిటిజన్లకు ఉచిత నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్టు ఫౌండేషన్ డీజీఎం కె. బంగార్రాజు తెలిపారు. ఆదివారం ఆయన శిల్పారామం వద్ద పోస్టర్ ఆవిష్కరించారు.

భీమిలి ఎస్ఐగా భరత్ కుమార్‌రాజు

భీమునిపట్నం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : భీమిలి పోలీసుస్టేషన్ లా అండ్ అర్డర్ ఎస్ఐగా ఎం. భరత్‌కుమార్‌రాజు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. సిటీ టాస్క్‌ఫోర్స్ ఎస్ఐగా పనిచేసిన ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ ఎస్ఐగా పని చేసిన జి. హరీష్‌ను సిటీ టాస్క్‌ఫోర్స్‌కు బదిలీ చేశారు.

పౌర సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం



నూతనంగా ఎన్నికైన సభ్యులు

మధురవాడ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పౌర సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం మధురవాడలో జరిగింది. సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ఆ సంఘం కార్యదర్శి ఎస్వీ రమణ తెలిపారు. గౌరవ అధ్యక్షుడిగా ఎల్ఎల్ నాయుడు, సలహాదారుడిగా ఎస్. రమేశ్, అధ్యక్షుడిగా నాగోతి సూర్యప్రకాశరావు, ఉపాధ్యక్షులుగా బెల్లాపు పాపారావు, బి. సతీశ్‌కుమార్, సంయుక్త కార్యదర్శులుగా పి. నాగేశ్వరరావు, ఎం. సతీశ్‌కుమార్, కోశాధికారిగా జగన్ మోహన్ చౌదరి ఎన్నికయ్యారు.

అప్రమత్తం

- దూసుకొస్తున్న మొంథా తుఫాన్
- తీరంలో ఎగసిపడుతున్న అలలు
- సందర్శకులను వెనక్కి పంపించిన యంత్రాంగం
- రైతులకు రెవెన్యూ అధికారుల సూచనలు



నిర్మానుష్యంగా ఉన్న భీమిలి బీచ్

భీమునిపట్నం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. మూడు రోజుల పాటు భారీ వర్షాలు పడతాయని వాతావరణ శాఖ సూచించడంతో ప్రజలకు పలు సూచనలు జారీ చేస్తున్నారు. ఇప్పటికే పద్మనాభం, ఆనందపురం, భీమిలి మండలాల్లోని తహశీల్దార్ కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. గోస్తనీ నదీ పరివాహక గ్రామాలతో పాటు రైతులను, లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ప్రజలను అప్రమత్తం చేశారు. భీమిలి బీచ్‌ను పూర్తిగా మూసివేశారు. ఆదివారం మధ్యాహ్నం నుంచి భీమిలి పోలీసులు, రుషికొండ మెరైన్ పోలీసులు బీచ్‌లోకి వెళ్లే అన్ని దారులను మూసివేశారు. సాగర సంగమ ద్వారం, లైట్ హౌస్ వద్ద మత్స్య ద్వారం, బీచ్ పార్క్, గాంధీ పార్క్ వద్ద బారికేడ్లు ఏర్పాటు చేశారు. అటు నోవాటెల్ వద్ద, ఇటు గెస్ట్ హౌస్ వద్ద పోలీసులు బందోబస్తు నిర్వస్తున్నారు. బీచ్‌కు వచ్చిన వారిని వెనక్కి పంపిస్తున్నారు. ఎంఎఫ్‌సీ పాఠశాలలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్టు తహశీల్దార్ రామారావు తెలిపారు. మండల మత్స్యశాఖ అభివృద్ధి అధికారి ఆర్. ఈశ్వర్‌రాజు, రుషికొండ మెరైన్ సీఐ శ్రీనివాసరావు తీర ప్రాంత గ్రామాలను సందర్శించి, మత్స్యకారులను అప్రమత్తం చేశారు. ఈనెల 29 వరకూ వేటకు వెళ్లరాదని సూచించారు. తుపాను ప్రభావంతో బలమైన గాలులతో పాటు భారీ వర్షాలు కురుస్తాయని వివరించారు.

తీరంలో బోట్లు నిలిపివేత

భీమునిపట్నం (రూరల్) : తుఫాన్ నేపథ్యంలో మత్స్యకారులు చేపల వేటకు తాత్కాలిక విరామం ప్రకటించారు. పడవలను, బోట్లను తీరంలో లంగరు వేశారు. మండలంలోని నాగమయ్యపాలెం,అన్నవరం, కొత్తపేట గ్రామాలకు చెందిన మత్స్యకారులకు చేపల వేటే జీవనాధారం. తుపాను వల్ల సముద్రం అల్లకల్లోలంగా ఉంటుందని, చేపల వేటకు వెళ్లరాదని అధికారులు హెచ్చరికలు జారీ చేయడంతో మత్స్యకారులు ఆదివారం తమ పడవలను తీరంలో నిలుపుదల చేశారు. కొందరు మర బోట్లతో వేటకు వెళ్లారని, వారు సాయంత్రానికి తీరం చేరుకుంటారని మత్స్యకారులు చెప్పారు.



నాగమయ్యపాలెంలో తీరంలో నిలిపివేసిన బోట్లు

గోస్తనీలో పెరిగిన నీటి ప్రవాహం



తగరపువలస వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న నీరు

తగరపువలస, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : గోస్తనీ నదిలో నీటి ప్రవాహం పెరిగింది. శనివారం సాయంత్రం తాటిపూడి రిజర్వాయరు నీటిని విడుదల చేయడంతో నది ఉధృతంగా ప్రవహిస్తోంది. తుఫాన్ నేపథ్యంలో వర్షాలకు నదిలో మరింత నీరు చేరే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. నీటి ఉధృతి ఎక్కువగా ఉండడంతో తాటితూరు,నగరపాలెం, సామేయవలస, మునివానిపాలెం గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఆయా గ్రామాల ప్రజలు తగరపువలస, సంగివలస మీదుగా రాకపోకలు సాగిస్తున్నారు. నగరపాలెం వద్ద డీపీస్ నిర్మించిన స్నాన ఘట్టం వరకు నీరు చేరింది. మూలకుద్దు, నాగమయ్యపాలెం, గుడివాడ, ఎరుసుపేట గ్రామాలకు చెందిన పంట పొలాల్లోకి నీరు చేరినట్టు స్థానికులు తెలిపారు. నదిలో ఎవరూ స్నానాలకు దిగరాదని అధికారులు హెచ్చరిక జారీ చేశారు.

తహశీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్

పద్మనాభం రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ నేపథ్యంలో మండలంలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ కాకర ఆనందరావు చెప్పారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మండలంలో మూడు రోజుల పాటు వర్షాలు పడే అవకాశం ఉందని, గోస్తనీ నది పరీవాహక గ్రామాలతో పాటు లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తహశీల్దార్ కార్యాలయంలో 24 గంటలు ప్రత్యేక కంట్రోల్ సెల్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు.



భీమిలి బీచ్‌రోడ్‌లో పోలీసుల బందోబస్తు



రుషికొండ బీచ్‌లో పర్యాటకులను వెనక్కి పంపిస్తున్న పోలీసులు

కొనసాగుతున్న తిరు నక్షత్ర పూజలు

సింహాచలం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో వార్షిక ఉత్సవాల్లో భాగంగా మనవాళ్ల మహామునుల తిరునక్షత్ర పూజలు ఘనంగా జరుగుతున్నాయి. ఆదివారం వేకువజామున స్వామివారిని మేల్కొలిపి సుప్రభాతసేవ, ప్రభాతారాధనలు పూర్తి చేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని, ఉభయ దేవేరులను పుష్పమాలికలతో అలంకరించి ఆళ్వార్లతో పాటు ఆస్థాన మండపంలో వేదికపై ఉంచారు. అధ్యాపకులు నాలాయిర దివ్య ప్రబంధనం పారాయణ చేయగా అర్చకులు షోడశోపచారాలను సమర్పించారు.

అప్పన్న సన్నిధిలో ఎమ్మెల్యే కళా వెంకట్రావు



కప్ప స్తంభం వద్ద ఎమ్మెల్యే కళా వెంకట్రావు

సింహాచలం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళా వెంకట్రావు సతీసమేతంగా వరాహలక్ష్మీనృసింహస్వామిని ఆదివారం దర్శించుకున్నారు. ఆయనకు దేవాలయ ఏఈఓ తిరుమలేశ్వరరావు ఆహ్వానం పలికారు. కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకున్న ఎమ్మెల్యే గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు పూజలు చేశారు.గోదాదేవి అమ్మవారి దర్శనం తరువాత పండితులు వేదాశీర్వచనాలీయగా, అధికారులు స్వామివారి ప్రసాదాలను అందజేశారు. కాగా నిత్యాన్న ప్రసాద పథకానికి ఎమ్మెల్యే కళా తన మనవడు పేరున రూ. 2 లక్షలు విరాళంగా అందజేశారు.

ఉచిత వైద్య శిబిరం



రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

కొమ్మాది, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఆర్ఎస్ఎస్ శత జయంతి ఉత్సవాల్లో భాగంగా నేషనల్ మెడికోస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఆరో వార్డు ఆర్‌హెచ్ కాలనీలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. లక్ష్మీవానిపాలెం, పీఎంపాలెం, వేపచెట్టు పార్కు ప్రాంతాలకు చెందిన రోగులకు శిబిరంలో వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు చక్రవర్తి, నాగరాజు, జనసేన నాయకుడు సంతోష్‌నాయుడు పాల్గొన్నారు.

పోరు ఉధృతం

... 5వ పేజీ తరువాయి

తీసుకున్న తరువాత సమ్మె విరమించే యోచనలో ఆస్పత్రుల యాజమాన్యాలు ఉన్నట్టు చెబుతున్నారు.

విరమణ యోచనలో కొన్ని..

జిల్లాలో 65 ప్రైవేటు/ కార్పొరేట్ నెట్‌వర్క్ ఆస్పత్రులు ఉండగా 32 ఆస్పత్రులు సమ్మెలో ఉన్నాయి. మరికొన్నింటిలో సాధారణ, అత్యవసర సేవలు అందిస్తున్నారు. సమ్మెలో ఉన్న కీలక ఆస్పత్రుల్లో కొన్ని వైద్య సేవలందించేందుకు సిద్ధపడుతున్నట్టు చెబుతున్నారు.ఇప్పటికే నాలుగు ఆస్పత్రులు రెండు రోజులుగా కొత్త రోగులను చేర్చుకుంటున్నాయని అధికారులు చెబుతున్నారు. మరో మూడు ఆస్పత్రులు సోమవారం నుంచి సేవలు ప్రారంభిస్తాయంటున్నారు. జిల్లాలో ప్రస్తుతం 26 ఆస్పత్రులు మాత్రమే పూర్తిగా సమ్మెలో ఉన్నాయన్నారు.

ఇదే అదనుగా దోపిడీ..

సమ్మెలో ఉన్నప్పటికీ కేన్సర్, కిడ్నీ బాధితులకు సేవలను కొనసాగించాలి. జిల్లాలోని కొన్ని ఆస్పత్రులు డయాలసిస్‌కు వస్తున్న రోగుల నుంచి భారీగా ఫీజులను వసూలు చేస్తున్నాయి. సమ్మె నేపథ్యంలో ఉచిత సేవలు అందించలేమని, డయాలసిస్‌కు రూ.4 వేల వరకు వసూలు చేస్తున్నాయి. కొన్నిచోట్ల కేన్సర్ రోగులకు కీమో, ఇతర థెరపీలకు డబ్బులు వసూలు చేస్తున్నారు. వీటిపై అధికారులు దృష్టి సారించి, చర్యలు తీసుకోవాలని రోగులు కోరుతున్నారు.

పెందుర్తి వీఆర్వోపై దాడి

... 5వ పేజీ తరువాయి

వీఆర్వో ఆనంద్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై సీఐ సతీశ్‌కుమార్ విచారణ చేపట్టారు. వీఆర్వోపై దాడి జరిగిందని తేలడంతో పెతకంశెట్టి నాగరాజు, పెతకంశెట్టి సూరిబాబు, పెతకంశెట్టి సురేశ్‌లను అదుపులోకి తీసుకున్నారు. ప్రభుత్వ ఉద్యోగి విధులకు ఆటంకం కలిగించడంతో పాటు, ఆక్రమణల తొలగింపును అడ్డుకుని అతనిపై దాడికి పాల్పడడంతో ముగ్గురు నిందితులపై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

పెట్టుబడిదారుల సదస్సుకు నగరం ముస్తాబు

... 5వ పేజీ తరువాయి

పెదవాల్తేరు కరకచెట్టు పోలమాంబ ఆలయం వరకు రోడ్డు మధ్యలోని డివైడర్‌కు రంగులు, ఇరువైపులా ఉన్న గోడలపై పెట్టుబడిదారుల సదస్సుకు సంబంధించిన లోగోలు, నినాదాలతో అద్భుతమైన కళాకృతులను తీర్చిదిద్దుతున్నారు. దీంతో ఆమార్గం నూతనశోభను సంతరించుకుంది. సిరిపురం జంక్షన్ నుంచి ఆశీల్‌మెట్ట తెలుగుతల్లి ఫ్లైఓవర్ మార్గంలో వేమనమందిరం వద్ద కొత్తగా సర్కిల్‌ను నిర్మించి, సంపత్‌వినాయగర్ ఆలయం లాండ్‌మార్క్ స్ఫురించేలా వినాయకుడి విగ్రహాన్ని ఏర్పాటుచేయడంతో సరికొత్త అందం ఆవిష్కృతమయింది. నగరంలో ఎటు చూసినీ సదస్సుకు సంబంధించిన అభివృద్ధి, సుందరీకరణ పనులే జోరుగా సాగుతున్నాయి.

ఇంగ్లండ్ జోరు

... 5వ పేజీ తరువాయి

ఇంగ్లండ్ 29.2 ఓవర్లలో కేవలం రెండు వికెట్లు నష్టపోయి ఛేదించింది. ఓపెనర్ అమీ జోన్స్ 75 బంతుల్లో 5 బౌండరీలు, 1 సిక్సర్‌తో అర్ధసెంచరీ పూర్తి చేసింది. మరో ఓపెనర్ టామీ బ్యూమౌంట్ 40 పరుగులు చేసి తహు బౌలింగ్‌లో ఎల్బీడబ్ల్యూగా అవుటైంది. హీదర్ నైట్ (33; 2 ఫోర్లు, 1 సిక్సర్) చెలరేగింది. అప్పటికే వికెట్ల ముందు పాతుకుపోయిన అమీ జోన్స్ రోజ్‌మెయిర్ బౌలింగ్‌లో మిడ్ వికెట్, మిడాఫ్ మీదుగా వరుసగా రెండు ఫోర్లు బాది మ్యాచ్‌ను ముగించింది. అంతకుముందు టాస్ గెలిచి బ్యాటింగ్ దిగిన న్యూజిలాండ్ 38.2 ఓవర్లలో 168 పరుగులకు ఆలౌటైంది. టాప్ ఆర్డర్‌లో జార్జి ప్లిమ్మర్ (43), అమెలియా కెర్ (35), కెప్టెన్ సోఫీ డివైన్ (23) మినహా మిగిలినవారు విఫలమయ్యారు. మ్యాచ్ ఎనిమిదో ఓవర్‌లో స్మిత్ బౌలింగ్‌లో అమెలియా కెర్ (35) బ్యాక్‌వర్డ్ పాయింట్, స్క్వేర్ లెగ్, మిడాఫ్, కవర్స్ మీదుగా వరుసగా నాలుగు బౌండరీలు బాది ఊపుమీద కనిపించినా తర్వాత ఓవర్‌లో క్యాప్సీ బౌలింగ్‌లో డీన్ క్యాచిచ్చి అవుటవడంతో మిగిలిన బ్యాటర్లు వరుసగా పెవిలియన్‌కు క్యూ కట్టారు. ఇంగ్లండ్ బౌలర్లలో లిన్సీ స్మిత్ మూడు వికెట్లు పడగొట్టగా....బ్రంట్, కాప్సీ చెరో రెండు వికెట్లు... సోఫీ, చార్లీ డీన్ చెరో వికెట్ తీశారు.

డిసెంబరు 9, 10 తేదీల్లో చలో ఢిల్లీ

తగరపువలస, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : కార్మిక పింఛన్‌దారులకు పెన్షన్ పెంచాలని డిమాండ్ చేస్తూ డిసెంబరు 9, 10 తేదీల్లో చలో ఢిల్లీ కార్యక్రమం చేపట్టనున్నట్టు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కె. రాంబాబు తెలిపారు. ఆదివారం ఆయన తగరపువలసలో జరిగిన కార్మిక పింఛన్‌దారుల సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుతం పింఛన్‌దారులకు చెల్లిస్తున్న రూ. 1000 పింఛన్ ఎటూ చాలడం లేదన్నారు. ప్రభుత్వం వృద్ధాప్య పింఛన్ రూ. 4 వేలు చెల్లిస్తుండగా అదే వయసు ఉన్న రిటైర్డ్ కార్మికులకు మాత్రం నెలకు వెయ్యి రూపాయలు ఇస్తున్నారని చెప్పారు. ఈవిషయమై పలుమార్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వినతులు ఇచ్చినా పట్టించుకోవడం లేదన్నారు. కనీస పింఛన్ రూ.7,500 చేయాలని డిమాండ్ చేశారు.

ముంచుకొస్తున్న మొంథా

... 5వ పేజీ తరువాయి

కలెక్టర్ ప్రకటించారు. ఈ విషయాన్ని అర్జీదారులు గమనించాలని కోరారు. వచ్చే సోమవారం యధావిధిగా కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఇక జీవీఎంసీలో ప్రతి సోమవారం నిర్వహించే పీజీఆర్ఎస్‌ను రద్దుచేసినట్టు జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ ప్రకటించారు. అధికారులు, సిబ్బంది తుఫాన్ ముందస్తు చర్యల్లో నిమగ్నమై ఉంటారని, ఈ నేపథ్యంలో పీజీఆర్ఎస్‌ను రద్దు చేశామని వివరించారు.

ఏయూలో తరగతులు రద్దు

తుఫాన్ నేపథ్యంలో ఆంధ్ర విశ్వవిద్యాలయంలో అన్ని తరగతులను ఈ నెల 27, 28 తేదీల్లో రద్దు చేస్తున్నట్టు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.రాంబాబు ఒక ప్రకటనలో తెలిపారు. హాస్టల్స్‌లో ఉండే విద్యార్థులు గదులకే పరిమితం కావాలని, అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని సూచించారు.

31 వరకు పర్యాటక ప్రాంతాలు మూసివేత

పాడేరు : తుఫాన్ నేపథ్యంలో ఈ నెల 28 నుంచి 31వ తేదీ వరకు జిల్లాలోని పర్యాటక ప్రదేశాలను మూసివేయాలని అధికారులను అల్లూరి సీతారామారాజు జిల్లా కలెక్టర్ దినేశ్‌కుమార్ ఆదేశించారు. జలపాతాల వద్దకు పర్యాటకులు రాకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు.

టీచర్లకూ టెట్

... 5వ పేజీ తరువాయి

సబ్జెక్టుల్లోని కొన్ని కీలక పాఠ్యాంశాలపై అవగాహన ఉండదు. ప్రాథమిక పాఠశాలల్లో బోధించే ఎస్జీటీ, భవిష్యత్తులో పదోన్నతి కోరుకుంటే లెవెల్-2 పరీక్ష రాయాలి.

ఉమ్మడి జిల్లాలో పది వేల మంది

ఉమ్మడి విశాఖ జిల్లాలో ప్రభుత్వ, జిల్లా పరిషత్, మునిసిపల్, గిరిజన సంక్షేమ శాఖ, గురుకులాల్లో సుమారు 15 వేల మందికి పైగా ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. వీరిలో 2014కు ముందు నియమితులైన, టెట్ రాయాల్సిన టీచర్లు పది వేల మంది వరకూ ఉంటారని అంచనా వేస్తున్నారు. 2014 తరువాత మూడు డీఎస్సీలు నిర్వహించారు. వీరంతా టెట్ అర్హత సాధించిన తరువాతే డీఎస్సీ ద్వారా ఎంపికై ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. వారు ఇప్పుడు కొత్తగా టెట్ రాయాల్సిన అవసరం లేదు. 2014కు ముందు పలు డీఎస్సీల ద్వారా ఎంపికై 1968 ఆగస్టు 31 తరువాత పుట్టినవారు, 2030 ఆగస్టు 31 తరువాత పదవీ విరమణ చేయనున్న టీచర్లు టెట్ అర్హత సాధించాలి. ఓపెన్ కేటగిరీ అయితే 90 మార్కులు, బీసీ అభ్యర్థులు 75 మార్కులు, ఎస్సీ/ఎస్టీలు 60 మార్కులు సాధించాలి. రెండేళ్ల అంటే 2027 సెప్టెంబరు నెలాఖరులోగా టెట్ అర్హత సాధించాలి. టీచర్లు టెట్ రాయాలని ఆదేశించడంపై ఎస్టీటీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇమంది పైడిరాజు అభ్యంతరం తెలిపారు. ప్రభుత్వం స్పందించి సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వేయాలని కోరారు.

ఆర్టీసీ అలర్ట్

... 5వ పేజీ తరువాయి

కాకినాడ, రాజమండ్రి, శ్రీకాకుళం, విజయనగరం వెళ్తుంటాయి. కాగా అగ్ని ప్రమాద సంఘటనలకు షార్ట్ సర్క్యూటే కారణమని తేలుతోంది. దీంతో ఆయా ప్యానల్స్, వైరింగ్‌ను ఎలక్ట్రికల్ ఇంజినీర్లు పరిశీలించారు.

డ్రైవర్లకు పరీక్షలు

బస్సుల లోపాలు సరిచేసిన అధికారులు ఏసీ బస్సుల డ్రైవర్ల గత రికార్డులను పరిశీలించారు. శారీరక, మానసిక ఆరోగ్యపరిస్థితి, కంటి చూపు, తదితర వైద్యపరీక్షలు నిర్వహించారు. గతంలో హెల్త్ రిపోర్టులు పరిశీలించారు. 45 సంవత్సరాల లోపు వయసు, డ్రైవింగ్‌లో సీనియారిటీ, ఏకాగ్రత ఉన్న డ్రైవర్లను ఎంపిక చేశారు. మద్యం అలవాటులేనివారిని గుర్తించి వినియోగించారు.

నిర్దేశిత వేగం మించొద్దు

బస్సుల తనిఖీ అనంతరం రీజనల్ మేనేజర్ బి.అప్పల నాయుడు ఏసీ సర్వీసుల డ్రైవర్లతో సమావేశమై నిర్దేశిత వేగానికి మించి బస్సులను నడపొద్దని సూచించారు. సాంకేతికలో లోపం గుర్తించినా, విద్యుత్ విభాగంలో లోపాలున్నా సాంకేతిక నిపుణులతో సరిచేయించుకున్న తరువాతే బస్సు నడపాలన్నారు.

శివాలయాలు ముస్తాబు



నగరపాలెంలో విద్యుత్ కాంతుల మధ్య కాశీవిశ్వేశ్వర ఆలయం



ఎండాడలో కైలాసగిరీశ్వరాలయం



భీమిలిలో భ్రమరాంబికా సహిత చోడేశ్వరాలయం

భీమునిపట్నం/భీమునిపట్నం రూరల్/ఎండాడ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని పలు శివాలయాలను కార్తీక మాసం తొలి సోమవారం జరిగే పూజలకు సుందరంగా ముస్తాబు చేశారు. భీమిలిలో భ్రమరాంబికా సహిత చోడేశ్వరస్వామి ఆలయం, కాత్యాయిని సహిత భీమేశ్వరస్వామి ఆలయం, బాలాత్రిపుర సుందరి సహిత చంద్రశేఖర ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. అలాగే శివకేశవ ఆలయాల సముదాయంలో ఉన్న రుక్మిణీ సత్యభామ సహిత వేణుగోపాలస్వామి, జగన్నాథస్వామి ఆలయాలను కూడా విద్యుత్ లైట్లతో సుందరంగా తీర్చిదిద్దారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా నిర్వాహకులు టెంట్లు ఏర్పాటు చేశారు. ఎండాడలో పశుపతినాథేశ్వరస్వామి ఆలయం, కైలాసగిరిలో భవానీ సమేత కైలాసగిరీశ్వరస్వామి ఆలయం, భీమిలి మండలంలోని నగరపాలెంలో కాశీవిశ్వేశ్వర ఆలయాన్ని కూడా ప్రత్యేకంగా అలంకరణ చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు ఆయా ఆలయాల వద్ద ఏర్పాట్లు చేపట్టారు.

వైద్య శిబిరం



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు, పాల్గొన్న ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు

పెదవాల్తేరు/ ఆరిలోవ అక్టోబరు 26 (ఆంధ్రజ్యో తి) : రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా అదివారం పెదవాల్తేరు బజార్ వద్ద, 10వ వార్డులో గల రవీంద్రనగర్ ఇందిరానగర్, ఆదర్శనగర్‌లో స్వాతంత్ర్య సమరయోధుల పేరుతో నేషనల్ మెడికోస్ ఆర్గనైజేషన్ అధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. నేషనల్ మెడికోస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో 100 మెడికల్ క్యాంపులు నిర్వహించినట్టు బీజేపీ విశాఖ మెడికల్ సెల్ కన్వీనర్ వెంకటేశ్వరరావు తెలిపారు.ఈ సందర్భంగా వృద్ధులు, మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. కార్యక్రమంలో కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకడు కేవీ రమణ, బీజేపీ 10 వ వార్డు అధ్యక్షుడు డి. రమణ, నేతలు పి.శ్రీనివాస్, ఎస్.అప్పలనాయుడు, ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు, ఆయా గ్రామాల పెద్దలు పాల్గొన్నారు.

యూజీడీకి మరమ్మతులు

వెంకోజీపాలెం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 15వ వార్డు భీమిలి నియోజకవర్గ ప్రాంతమైన లక్ష్మీ నరసింహ నగర్ రామాలయం వద్ద కొండవాలు ప్రాంతంలో ఎప్పటి నుంచో ఉన్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య చొరవ తీసుకున్నారు. ఆమె సొంత నిధులు వెచ్చించి మరమ్మతులు చేయించారు. ఈ పనులను శనివారం ఆమె పరిశీలించారు. కార్పొరేటర్ వెంట లక్ష్మీనరసింహనగర్ గ్రామ అధ్యక్షుడు, టీడీపీ 15వ వార్డు ఉపాధ్యక్షులు బోను సూరిబాబు, గ్రామస్థులు ఎన్ని సత్యం, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సముద్రంలో కొట్టుకుపోతున్న బాలుడిని రక్షించిన లైఫ్‌గార్డులు

బీచ్ రోడ్డు, అక్టోబర్ 26, (ఆంధ్రజ్యోతి) : ఆర్కే బీచ్‌లో కాళికామాతా దేవాలయం వద్ద తాటిచెట్లపాలెం ప్రాంతానికి చెందిన మణిదీప్ (15) తన స్నేహితుడు నిఖిల్‌తో కలిసి ఆర్కే బీచ్‌కు వెళ్లి సరదాగా సముద్రంలో దిగారు. కెరటాల తాకిడి ఎక్కువ ఉండడంతో సముద్రంలోకి కొట్టుకుపోయాడు. దగ్గరలో ఉన్న పర్యాటకులు వారిని చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. లైఫ్ గార్డులు సకాలంలో స్పందించి అతడిని రక్షించి ఒడ్డుకు చేర్చారు. ప్రథమ చికిత్స చేయడంతో ఆరోగ్యం కుదుట పడింది. శ్వాస తీసుకోవడానికి ఇబ్బంది పడుతుండడంతో మణిదీప్‌ను జీవీఎంసీ లైఫ్ గార్డులు, త్రీటౌన్ పోలీసులు 108లో కేజీహెచ్‌కు తరలించారు కేసును త్రీ టౌన్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.కాగా, తీరానికి వచ్చే సందర్శకులు అప్రమత్తంగా ఉండాలని సముద్రంలో సాన్నాలు వంటివి చేయకపోవడం మంచిదని పోలీసులు హెచ్చరించారు.

సినిమా గైడ్

- **బైసన్** : శారదా,
- **తమ్మా** : రమాదేవి
- **డూడ్** : శరత్, శ్రీరామా, లీలామహల్, శ్రీకన్య, ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం), లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)
- **క్రాంప్** : సంగం, కామేశ్వరి, వెంకటేశ్వర-1, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం),
- **ఓజి**: కిన్నెర, కామేశ్వరి, శ్రీకన్య హెవెన్-3, మినీ మోహిని (గాజువాక), శ్రీకాంతి, సుకన్య,
- **మిరాయి**: సౌజన్య(గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 17, టమాటా 34, వంకాయలు (తెలుపు) 50, వంకాయలు (నలుపు) 50, బెండకాయలు 36, పచ్చిమిర్చి 38, కాకరకాయలు 34, బీరకాయలు 36, ఆనపకాయ 24, కాలీఫ్లవర్ 40, క్యాబేజి 26, క్యారెట్ 66, దొండకాయలు 42, బంగాళ దుంపలు 20, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 78, అల్లం (పాతది) 70, బరబాటి 40, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 50, బద్దచిక్కుడు 66, దోస కాయలు 28, వెల్లుల్లి (పెద్దవి) 65, కొబ్బరికాయ (పెద్దది) 40, బీన్స్ (పెన్సిల్) 70, కీరదోస 20, కాప్సికమ్ 70, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 34, చిలగడదుంపలు 36, కంద 48, దేముడు చిక్కుడు 76, గోరు చిక్కుడు 42, కూర పెండలం 36, బ్రకోలి 45, పనస పొట్టు 200, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 22, మామిడి అల్లం 90, బొప్పాయి 32, జామ కాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	560
విజయనగరం	564
శ్రీకాకుళం	564

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	115
లైవ్ ధర	135
విత్ స్కిన్	240
స్కిన్‌లెస్	250

పోలియో రహిత సమాజమే లక్ష్యం

- నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి
- రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం



ప్రసంగిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి, పాల్గొన్న రోటరీ క్లబ్ బ్లడ్ బ్యాంక్ డాక్టర్ కల్యాణచక్రవర్తి, ప్రతినిధులు

బీచ్ రోడ్డు, అక్టోబర్ 26 (ఆంధ్రజ్యోతి) : మనమంతా పోలియో రహిత సమాజమే లక్ష్యంగా పని చేయాలని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి పేర్కొన్నారు. ఆదివారం బీచ్ రోడ్డు వద్ద రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోలియో అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పోలియోకు రెండు రకాల వ్యాక్సిన్లున్నాయని, వీటికి సరైన సమయంలో ఇవ్వడం ద్వారా పోలియోను నిర్మూలించడం సాధ్యపడుతుందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా పోలియో నిర్మూలన అవసరమన్నారు. పిల్లల నిండు జీవితాన్ని కాపాడేందుకు ప్రభుత్వం ప్రతి ఏటా పల్స్ పోలియో కార్యక్రమాన్ని చేపడుతోందన్నారు. ఐదేళ్ల చిన్నారులకు కచ్చితంగా పోలియో చుక్కలు వేయించాలని ప్రభుత్వాలు ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఉన్నాయన్నారు. పిల్లల బంగారు భవిష్యత్తు కోసం రెండు పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలన్నారు. అంగ వైకల్యానికి కారణమయ్యే పోలియో వైరస్ నుం పిల్లలను రక్షించుకునేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందన్నారు. పిల్లల్లో రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. పోలియో వ్యాక్సినేషన్ ప్రచార డ్రైవ్ కోసం సన్నాహాలు జరుగుతున్నాయని, అనేక ప్రాంతాల్లో ఆరోగ్య సిబ్బంది పోలియో బూత్‌లను ఏర్పాటు చేశారన్నారు. పోలియో వ్యాక్సిన్ నిర్వహణ కోసం ప్రత్యేకంగా ఆరోగ్య సిబ్బందికి శిక్షణ ఇస్తున్నారన్నారు. కార్యక్రమంలో రోటరీ బ్లడ్ బ్యాంక్ డాక్టర్ కల్యాణచక్రవర్తి, ప్రతినిధులు శోభన్ ప్రకాష్, పార్థసారధి, రాంబాబు, కాశీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఫిట్ ఇండియాలో అందరూ భాగస్వాములు కావాలి

- ఎస్‌బీఐ డీజీఎం రాహుత్ సంక్రీత్యా పిలుపు



ర్యాలీలో పాల్గొన్న రాహుల్ సంక్రీత్యా, ఎస్‌బీఐ అధికారులు, సిబ్బంది

బీచ్ రోడ్డు, అక్టోబర్ 26, (ఆంధ్రజ్యోతి) : ఫిట్ ఇండియా కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిప్యూటీ జనరల్ మేనేజర్ రాహుల్ సంక్రీత్యా పిలుపునిచ్చారు. ఆదివారం బీచ్ రోడ్డులో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఫిట్ ఇండియా అవగాహన ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఫిట్ ఇండియా ఫ్రీడమ్ రన్ 6.0 కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ పచ్చదనం-పరిశుభ్రత కోసం శ్రమించాలన్నారు. పర్యావరణ పరిరక్షణపై నగర వాసులకు అవగాహన కల్పించాలని కోరారు. ఉద్యోగులు అంకితభావంతో తమ వృత్తిని నిర్వర్తిస్తే ఉన్నత స్థానం సాధ్యమన్నారు. పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పరిశుభ్రత విషయంలో భాగస్వామ్యులు కావాలన్నారు. జీవవరణ సమతౌల్యతకు ఇది ఎంతో అవసరమని వెల్లడించారు. తీర ప్రాంతాల పరిశుభ్రత వల్ల జీవరాశులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. పర్యాటకులకు కూడా బీచ్‌లో ఆహ్లాదకర వాతావరణం కల్పించేలా కృషి చేయాలన్నారు. అనంతరం ఆర్కే బీచ్ లోని కాళీమాత దేవాలయం నుంచి వైఎంసీఏ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రీజనల్ మేనేజర్ సంజిత్ కుమార్, డెబ్‌నాత్, చీఫ్ మేనేజర్ రాఘవరాజు, పీఆర్వో కె.ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ఒత్తిడి దూరం

- పతంజలి యోగా సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రసాదరావు



అభ్యాసకులను సూచనలిస్తున్న ప్రసాదరావు

బీచ్ రోడ్డు, అక్టోబర్ 26, (ఆంధ్రజ్యోతి) : ప్రతిరోజు క్రమం తప్పకుండా యోగా చేయడం వలన ఒత్తిడి నుంచి ఉపశమనం, మానసిక రుగ్మతలు దరి చేరవని పతంజలి యోగా సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు టీవీస్ ప్రసాదరావు పేర్కొన్నారు. ఆదివారం వైఎంసీఏ కూడలి వద్ద భారత్ స్వాభిమాన్ ట్రస్ట్, పతంజలి యోగా సమితి ఆధ్వర్యంలో యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజారోగ్య రక్షణకు నిరంతరం యోగాసనాలు చేయడం ఎంతో అవసరమని తెలిపారు. యోగా చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని వెల్లడించారు. యోగాను ప్రతి ఒక్కరూ జీవనశైలిలో భాగంగా చేసుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న కృషిని అందరూ స్వాగతించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరి ప్రభాకర్, జిల్లా అధ్యక్షులు నాగేశ్వరరావు, బి.ప్రభాకర్ మూర్తి, వై.ఐ.బి.రెడ్డి, కృష్ణ, శైలజ, సోమేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

ఏయూ అమెరికా అలూమ్ని చాప్టర్‌తో వీసీ సమావేశం




వీసీ రాజశేఖర్‌తో వర్చువల్‌లో సమావేశమైన పూర్వ విద్యార్థులు

విశాఖపట్నం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్ర యూనివర్సిటీ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ అమెరికాలో స్థిరపడిన ఏయూ పూర్వ విద్యార్థులతో ఆదివారం వర్చువల్ విధానంలో సమావేశమ య్యారు. ఈ సమావేశంలో అమెరికాలో స్థిరపడిన 60 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీసీ వారితో మాట్లాడుతూ ఏయూ శతాబ్ది ఉత్సవాలను నిర్వహిస్తున్న విధానాన్ని వివరించారు. వేడుకల్లో పూర్వ విద్యార్థులంతా భాగస్వాములు కావాలని, భవిష్యత్తులో నిర్వహించే కార్యక్రమాల్లో పూర్వ విద్యార్థులు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో అలూమ్ని రిలేషన్స్ సంచాలకులు ప్రొఫెసర్ పి.శ్యామల తదితరులు పాల్గొన్నారు.

వచ్చే నెల 10న కార్తీక దీపోత్సవం

ఎంవీపీ కాలనీ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం సందర్భంగా తిరుపతి తిరుమల తిరుపతి దేవస్థానం, విశాఖపట్నం హిందూ ధర్మ ప్రచార పరిషత్ సంయుక్తంగా నవంబరు పదో తేదీన భారీ ఎత్తున కార్తీక దీపోత్సవం నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నాయి. పదో తేదీ సాయంత్రం అయిదు గంటలకు రుషికొండపైన గల శ్రీమహాలక్ష్మీ గోదా సమేత వేంకటేశ్వరస్వామి దివ్యక్షేత్రం ఆవరణలో అయిదు వేల మంది భక్తులతో ఈ దీపోత్సవాన్ని నిర్వహించనున్నట్టు ఎంవీపీ కాలనీలోని టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ భారీ దీపోత్సవంలో పాల్గొనదలచిన భక్తులు ఎంవీపీ కాలనీలోని కార్యాలయంలో గాని లేదా హెచ్‌డీపీపీ ప్రతినిధి సీహెచ్ సత్యనారాయణ ఫోన్ నెంబర్లు : 9491607365, 9441057674లో సంప్రదించి, వివరాలు తెలుసుకోవచ్చునిసంస్థ పేర్కొంది.

అలరించిన దీక్షితర్ కృతులు



కార్యక్రమం ప్రారంభోత్సవంలో నిర్వాహకులు

మద్దిలపాలెం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : పిఠాపురంకాలనీ కళాభారతి ఆడిటోటరియంలో ఆదివారం త్యాగరాజ ఆరాధన ట్రస్టు ఆధ్వర్యంలో ప్రముఖ గాత్ర విద్వాంసురాలు లలిత చంద్రశేఖర్ ఆలపించిన ముత్తుస్వామి దీక్షితర్ కృతులు అలరించాయి. 50 మంది శిష్యులతో దీక్షితర్ 17 కృతులను గానం చేసి సంగీత ప్రియులను మంత్రముగ్ధులను చేశారు. పంచమాతంగ ముఖ, శ్రీసాంబశివం, శ్రీదుం దుర్గె, శ్రీమధురాంబిక, గురుగుహాయ, త్యాగరాజే, హరియువతీం, కమలాంబ, నరసింహ, గంగే మాం పాహి వంటి భక్తి గానాలతో పరవశింపజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ కార్యదర్శి రాంబాబు మాట్లాడుతూ 1776-1835లో కర్ణాటక సంగీతంలో సుప్రసిద్ధ గాయకులు ముత్తుస్వామి దీక్షితర్ అన్నారు. ఆయన త్యాగయ్య, శ్యామశాస్త్రి వంటి సంగీత దిగ్గజాలతో పాటు ప్రసిద్ధి చెందిన సంగీత విద్వాంసులని తెలిపారు. కార్యక్రమంలో ట్రస్టు కోశాధికారి రామగోపాల్, అప్పన్న, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులు చేపల వేటకు వెళ్లొద్దు

- తుపాను నేపథ్యంలో అధికారులకు సహకరించాలి
- ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు



మృతుడు ఒలిశెట్టి గురునాథ్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి

పెదవాల్తేరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో పెదజాలారిపేటలోని సంప్రదాయ మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లరాదని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు కోరారు. పెదజాలారిపేటకు చెందిన మత్స్యకారుడు ఒలిశెట్టి గురునాథ్ (49) ఇటీవల చేపలవేటకు వెళ్లి గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్‌లో మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గురునాథ్ కుటుంబసభ్యులను ఆదివారం రాత్రి ఎమ్మెల్యే రామకృష్ణబాబు పరామర్శించారు. అలాగే పెదజాలారిపేటకు చెందిన రామోలు ఎల్లాజీ (28) శుక్రవారం సముద్రంలో చేపల వేటకు వెళ్లి తిరిగి రాకపోవడంలో కుటుంబ సభ్యులతో పాటు అందరూ ఆందోళనకు గురయ్యారు. అతడు కాకినాడ జిల్లా తుని మండలం ఉకుంపేట, జంగంపేట దగ్గరలో ఉన్నట్టు ఆచూకీ తెలియడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అతడి కుటుంబాన్ని కూడా ఎమ్మెల్యే పరామర్శించి ధైర్యం చెప్పారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... తుపాను వాతావరణం నేపథ్యంలో మత్స్యకారులు చేపల వేటకు వెళ్లవద్దని కోరారు. అధికార యంత్రాంగం ముందస్తు హెచ్చరికల నేపథ్యంలో మత్స్యకారులు సహకరించాలని, సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని సూచించారు. సహాయక చర్యలు, శిబిరాలను వినియోగించుకోవాలన్నారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ నాయకులు బైరెడ్డి పోతన్నారెడ్డి, తెడ్డు రాజు, బాపిరాజు, పోలారావు, మాణిరెడ్డి, తెడ్డు సతీష్, నూకన్న గ్రామ పెద్దలు తదితరులు ఉన్నారు.

ఏయూలో సేంద్రియ పంటల సంత



స్టాళ్ల వద్ద కొనుగోలుదారుల సందడి

మద్దిలపాలెం, అక్టోబరు 26 : ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంక్యుబేషన్ హబ్ వద్ద గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన సేంద్రియ సంతకు విశేష స్పందన లభించింది. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి రైతులు ప్రకృతి ఆధారంగా పండించిన పంటలను సంతలో ప్రదర్శించారు. రసాయన ఎరువులు వినియోగించకుండా పండించిన కూరగాయలు,ఆకుకూరలు, పప్పులు, బియ్యం, తదితర నిత్య అవసర వస్తువులను నగరవాసులు కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు దాట్ల సుబ్రహ్మణ్య వర్మ మాట్లాడుతూ సేంద్రియ ఎరువుల పంటలు వాడకం ఆరోగ్యకరమన్నారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు అశోక్, రైతులు రిషి, సత్యన్నారాయణ, చలపతి, ఉషాగజపతి, జేవీ రత్నం తదితరులు పాల్గొన్నారు.

ఏయూ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణకు ప్రతిభ అవార్డు

విశాఖపట్నం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రా యూనివర్సిటీ అనుభౌతిక శాస్త్ర విభాగం ప్రొఫెసర్ డాక్టర్ పీవీ లక్ష్మీనారాయణకు డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జాతీయ ప్రతిభ అవార్డు లభించింది. ఆదివారం గుంటూరులో నిర్వహించిన కార్యక్రమంలో ఆయనకు నిర్వాహకులు ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. విద్యారంగంలో ప్రొఫెసర్ లక్ష్మీ నారాయణ అందించిన సేవలకు ఈ పురస్కారాన్ని అందించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, పలువురు ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

శ్మశాన వాటికలో స్వచ్ఛ భారత్

వెంకోజీపాలెం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ పరిధిలోని 16వ రజక వీధి వద్ద ఉన్న శ్రీరాధాకృష్ణ యాదవ సేవా సంఘం శ్మశాన వాటికలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని ఆదివారం సంఘం సభ్యులు శుభ్రం చేశారు. స్మశానంలో పేరుకుపోయిన తుప్పలను తీసి వేసి శానిటరీ సిబ్బంది సహాయంతో చెత్తను తొలగించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ఒమ్మి ముత్యాలరాజు, ప్రతినిధులు నమ్మి చిన్నరాజు, ఒమ్మి రవి, ఒమ్మి ప్రసాద్, పల్లా గోపి, ఒమ్మి శంకర్, జగ్గారావు తదతరులు పాల్గొన్నారు.

సంతకాల సేకరణ

మద్దిలపాలెం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 22 వ వార్డులోని సిద్ధార్థనగర్‌లో ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకిస్తూ వైసీపీ నాయకులు సంతకాలు సేకరణ చేపట్టారు.. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావు పాల్గొని ఇంటింటికి వెళ్లి సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు వైద్య విద్య అందించే లక్ష్యంతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మెడికల్ కళాశాలలు నిర్మాణం ప్రారంభించారన్నారు. వాటిని కూటమి ప్రభుత్వం పీపీపీ పద్ధతిలో ప్రైవేటుపరం చేయడం దారుణమన్నారు. కార్యక్రమంలో వైసీపీ వార్డు అధ్యక్షుడు పీతల గోవింద్, రాజు, ఈశ్వర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ దీపాల నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు

- ఎలక్ట్రికల్ సిబ్బందికి జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశం

వెంకోజీపాలెం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : నగరంలో ప్రతి విద్యుత్ దీపం వెలిగేలా కార్యాచరణ చేపట్టాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్ జీవీఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. శనివారం అర్ధరాత్రి ఆయన నగరంలోని బీచ్ రోడ్డు ప్రాంతంలో కోస్టల్ బ్యాటరీ నుంచి తొట్లకొండ వరకు రోడ్డుకు ఇరువైపులా విద్యుత్ దీపాలను జీవీఎంసీ అదనపు కమిషనర్ ఎస్ఎస్ వర్మ, జీవీఎంసీ ప్రధాన ఇంజనీరు పీవీవీ సత్యనారాయణ, పర్యవేక్షక ఇంజనీరు సంపత్‌కుమార్‌లతో కలిసి ఆకస్మికంగా పరిశీలించారు. ఈ పరిశీలనలో కమిషనర్ ముందుగా కోస్టల్ బ్యాటరీ నుంచి తొట్లకొండ వరకు వెళ్లే బీచ్ రోడ్డులోని వెలగని పలు వీధి దీపాలను గుర్తించి, వాటి నిర్వహణపై సంబంధిత ఎలక్ట్రికల్ విభాగం ఇంజనీరింగ్ అధికారులను ఆరా తీశారు. తక్షణమే వెలగని విద్యుత్ దీపాలు వెలిగేలా చర్యలు చేపట్టాలని ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగం అధికారులకు ఆదేశించారు. నగరంలో వీధి దీపాలు సరిగా వెలగడం లేదని అధికంగా ఫిర్యాదులు అందుతున్నందున వాటి నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించి ప్రతి వీధి దీపం వెలిగేలా చర్యలు చేపట్టాలన్నారు. నగరంలో ప్రధాన కూడళ్లు, జాతీయ రహదారులు, ప్రధాన రహదారులు, బీచ్‌రోడ్డు, కాలనీలు తదతర అన్ని ప్రాంతాల్లో నిత్యం వీధి దీపాలను పరిశీలించాలని, వాటి సమగ్ర నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎలక్ట్రికల్ విభాగం సహాయక ఇంజనీర్లకు ఆదేశించారు.

వీధి దీపాల నిర్వహణలో లోపాలు లేకుండా చూడాలని, అలాగే ప్రజల నుంచి ఎటువంటి ఫిర్యాదులు అందరాదన్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా 49 మంది అసిస్టెంటు ఇంజనీర్లు (ఎలక్ట్రికల్)ను వర్కింగ్ అరేంజ్‌మెంట్ ఆధారంగా ప్రతి ఇద్దరు వార్డులకు ఒకరిని ఇన్‌చార్జిగా నియమించామని, వారు నగరంలో వీధి దీపాల సంరక్షణ, పర్యవేక్షణ బాధ్యతలు నిర్వర్తించేలా, నిత్య పరిశీలన జరిపి వీధిలైట్లు వెలిగే కార్యాచరణ చేపట్టాలని ప్రధాన ఇంజనీర్ పీవీవీ సత్యనారాయణ రాజుకు కమిషనర్ ఆదేశించారు. ఈ పరిశీలనలో జోనల్ కమిషనర్ శివప్రసాద్, పలువురు జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులు, వార్డు సచివాలయం ఎమినిటీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

సముద్రంలో గల్లంతైన ఎల్లాజీ అచూకీ లభ్యం

- కాకినాడ జిల్లా జంగంపేట దగ్గర ఉన్నట్టు గుర్తించి తీసుకొచ్చిన కుటుంబ సభ్యులు



పోలీస్ స్టేషన్‌లో భార్యతో రామోలు ఎల్లాజీ

పెదవాల్తేరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) ! సముద్రంలో చేపల వేటకు వెళ్లి శుక్రవారం సముద్రంలో గల్లంతైన పెదజాలారిపేటకు చెందిన మత్స్యకారుడు రామోలు ఎల్లాజీ (28) అచూకీ లభ్యమైంది. అతడు ఆదివారం ఉదయం కాకినాడ జిల్లా తుని మండలం ఉకుంపేట, జంగంపేట దగ్గరలో ఉన్నట్టు సమాచారం అందడంతో ఎల్లాజీని తీసుకొచ్చేందుకు పెదజాలారిపేట గ్రామం నుంచి కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలు ఆదివారం ఉదయం కాకినాడ జిల్లా తుని మండలం ఉకుంపేట, జంగంపేట చేరుకుని ఎల్లాజీని సురక్షితంగా పెదజాలారిపేట తీసుకొచ్చారు. దీంతో అతడి కుటుంబ సభ్యులు, బంధువులు, మత్స్యకారులు ఆనందం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులు పోలీసుస్టేషన్‌కు వెళ్లి అతడు వచ్చిన సమాచారం అందించి గల్లంతైన విషయమై ఇచ్చిన ఫిర్యాదును వాపసు తీసుకున్నారు.

హత్య కేసులో నిందితుల అరెస్టు

- సెల్ సిగ్నల్స్ ఆధారంగా గుర్తించిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన డీసీపీ లతామాధురి



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ (క్రైం) లతామాధురి

గాజువాక, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : గాజువాక ఆటోనగర్‌లో లారీ డ్రైవర్‌ను హత్య చేసిన నిందితులను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు గాజువాక పోలీస్ స్టేషన్‌లో ఆదివారం జరిగిన విలేకర్ల సమావేశంలో డీసీపీ (క్రైం) లతామాధురి వివరాలు వెల్లడించారు.

ఛత్తీస్‌గఢ్ నుంచి విశాఖ స్టీల్‌ప్లాంటుకు అల్యూమినియం లోడుతో డ్రైవర్ మీరాజ్ హుస్సేన్ (35) ఈ నెల 10న బయలుదేరాడు. ఛత్తీస్‌గడ్‌లోని మహాసముంద్ జిల్లా సరైపాలి గ్రామానికి చెందిన ఇంద్రపాల్‌సింగ్ రాజ్‌పుత్ (27), రతీనాయక్ (25) విశాఖ వచ్చేందుకు రాయగడ కేరడా చెక్‌పోస్ట్ వద్ద లారీ ఎక్కారు. లారీ 11న అర్ధరాత్రి ఆటోనగర్ చేరుకొంది. అక్కడ పార్క్ చేసి లారీలోనే ముగ్గురూ మద్యం సేవించారు. అనంతరం డ్రైవర్ హుస్సేన్ తలపై ఇంద్రపాల్‌సింగ్ రాజ్‌పుత్ ఇనుప రాడ్డుతో బలంగా కొట్టడంతో మృతిచెందాడు. వెంటనే హుస్సేన్ వద్ద నగదు, సెల్‌ఫోన్, రిస్ట్ వాచ్‌లను తీసుకొని నిందితులు దువ్వాడ రైల్వేస్టేషన్‌కు చేరుకుని, రైల్లో ఛత్తీస్‌గఢ్ వెళ్లిపోయారు.

ఇదిలావుండగా 15వతేదీ వచ్చినా లారీ ప్లాంటుకు చేరుకోకపోవడంతో యజమాని జీపీఎస్ ద్వారా లోకేషన్ గుర్తించి, మృతుడి సోదరుడు నజీబ్ హుస్సేన్‌ను విశాఖ పంపించాడు. అతడు వచ్చి చూడగా లారీలో హుస్సేన్ (35) మృతదేహం కనిపించింది. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. .

సెల్‌ఫోన్ లొకేషన్..

మృతి చెందిన డ్రైవర్ మీరాజ్ హుస్సేన్ సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఛత్తీస్‌గడ్‌లో ఉన్నట్టు గుర్తించిన గాజువాక పోలీసులు ప్రత్యేక బృందంతో వెళ్లి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా ఇంద్రపాల్‌సింగ్ రాజ్‌పుత్ ఈ నెల 10న ఒడిశాలోని సంబల్‌పూర్‌లో ఓ వృద్ధుడ్ని హత్య చేసి రూ.5 వేల నగదు, సెల్‌ఫోన్ చోరీ చేశాడని తేలింది. అంతేకాకుండా ఒడిశా రాష్ట్రంలో పలు చోరీలు, మహిళల పట్ల అసభ్యకర ప్రవర్తన కేసుల్లో నిందితుడని గుర్తించారు. అతడ్ని అప్పగించేందుకు స్థానిక పోలీసులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో సీపీ శంఖబ్రతబాగ్చి ఉన్నతాధికారులతో మాట్లాడడంతో అప్పగించారు. సమావేశంలో ఏసీపీ వై.శ్రీనివాసరావు, సీఐలు పార్థసారధి, శ్రీనివాసరావు పాల్గొన్నారు. కేసు ఛేదించిన ఎస్ఐ హరికృష్ణను అధికారులు అభినందించారు.

మాదిన ప్రసాద్‌కు 'రైతునేస్తం' అవార్డు ప్రదానం



వెంకయ్యనాయుడు, తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న మాదిన ప్రసాద్

ఆరిలోవ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : విశాఖపట్నంలో పశు సంవర్ధక శాఖలో సహాయ సంచాలకుడుగా పని చేస్తున్న డాక్టర్ మాదిన ప్రసాద్ ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు, తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుల చేతుల మీదుగా 'రైతునేస్తం' అవార్డును అందుకున్నారు. హైదారబాద్‌లో గల శంషాబాద్‌లోని స్వర్ణ భారతి ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఈ అవార్డును నిర్వాహకులు అందజేశారు. వ్యవసాయ, అనుబంధ రంగాల్లో ప్రసాద్ అందించిన సేవలకు గుర్తింపుగా ఈ అవార్డు బహూకరించినట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ అవార్డు అందుకోవడం తనకు గర్వకారణంగా ఉందని ప్రసాద్ అన్నారు.

డ్రగ్స్ మహమ్మారిపై 29 నుంచి చైతన్య శిబిరాలు

డాబాగార్డెన్స్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): భారత ప్రభుత్వ నేషనల్ అకాడమీ ఆఫ్ కస్టమ్స్ ఇన్ డైరెక్ట్ టాక్సెస్ అండ్ నార్కోటిక్స్ (నాసిన్)తో కలిసి ఈ నెల 29 నుంచి డ్రగ్స్ మహమ్మారిపై చైతన్య శిబిరాలు నిర్వహిస్తున్నట్టు బాల వికాస ఫౌండేషన్ వ్యవస్థాపకుడు నరవ ప్రకాశరావు తెలిపారు. డ్రగ్స్‌తో ఎదురయ్యే అనర్థాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించాలన్న ఉద్దేశంతో కళాశాలల్లో శిబిరాలు నిర్వహిస్తామన్నారు. 29న ఉదయం మాధవధారలోని పాలిటెక్నిక్ కెమికల్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు శిబిరం నిర్వహిస్తామన్నారు. నాసిన్ అదనపు డైరెక్టర్ జనరల్ ఈదర రవికిరణ్ అవగాహన కలిగిస్తారన్నారు. శిబిరాలపై ఆసక్తిగలవారు 90324 77463 ఫోన్ నెంబరులో సంప్రదించాలని సూచించారు.

ముగిసిన చెస్ పోటీలు

విశాఖపట్నం స్పోర్ట్స్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా, రాష్ట్ర చెస్ సంఘాల నేతృత్వంలో ఆదిత్య చెస్ అకాడమీ నిర్వహించిన జిల్లా స్థాయి చదరంగం పోటీలు ఆదివారం ముగిశాయి. నగరంలోని నవోదయ జూనియర్ కళాశాలలో జరిగిన ఈ టోర్నీలో జిల్లా వ్యాప్తంగా 175 మంది క్రీడాకారులు పాల్గొని ప్రతిభను ప్రదర్శించారు. ఈ పోటీల్లో వంశీకృష్ణ ప్రథమ స్థానంలో నిలవగా, తనిష్ ద్వితీయ, కె.ప్రశాంత్ తృతీయ స్థానాలను దక్కించుకున్నారు. టోర్నీ ముగింపు కార్యక్రమానికి బి.శెట్టిరావు ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీలు, నగదు బహుమతులు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో చెస్ సంఘం ప్రతినిధులు బాబురావు, ఎస్.మణికంఠరావు, ఎం.రామకృష్ణ పాల్గొన్నారు.

ఆలయానికి చిత్రపటాల బహూకరణ

మాధవధార, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మాధవధార జీవీఎంసీ హైస్కూలు వద్ద గల ఉమారామలింగేశ్వరస్వామి ఆలయానికి శివ పరివారంతో కూడిన పెద్ద ఫొటో ఫ్రేములను టి.నాగరాజేశ్వరి బహూకరించారు. కుటుంబ సభ్యులతో కలసి వచ్చిన ఆమె ఆలయ కమిటీ అధ్యక్షుడు టి.నారాయణరెడ్డి, సభ్యులకు వీటిని అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం అర్చకుడు ఎం.భానుమూర్తి వారితో విశేష పూజలు చేయించి వేదాశీర్వచనమిచ్చారు. సుమారు రూ. 20 వేలతో స్వామి చిత్రపటాల్ని ప్రత్యేకంగా తయారు చేయించి అందించారని కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయ ప్రధాన కార్యదర్శి సనపల వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

సీతంపేట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): నాలుగో పట్టణ పోలీసు స్టేషన్, ద్వారకా పోలీసు స్టేషన్లలో రౌడీ షీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. సీఐలు ఉమాకాంత్, డి.వి. రమణలు రౌడీ షీటర్లకు పలు సూచనలు చేస్తూ, ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుని, నగర బహిష్కరణ చేయిస్తామన్నారు. రౌడీషీటర్లపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తామని, వారి నడవడికలో ఏ చిన్న తేడా వచ్చినా, తప్పుదోవలో నడిచినా అదుపులోకి తీసుకొని కఠిన చర్యలు తీసుకుంటామని సీఐలు హెచ్చరించారు.

కేజీహెచ్ వైఎస్ఆర్ టీయూసీ అధ్యక్షునిగా శ్రీనివాసరావు



నియామక పత్రం అందుకుంటున్న నీలాపు శ్రీనివాసరావు

మహారాణిపేట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కేజీహెచ్ వైఎస్ఆర్ టీయూసీ యూనియన్ జిల్లా అధ్యక్షుడిగా నీలాపు శ్రీనివాసరావు నియమితులయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు పి.గౌతమ్ నుంచి ఆదివారం ఆయన నియామక పత్రాన్ని అందుకున్నారు. కేజీహెచ్‌లో ఉద్యోగిగా పనిచేస్తున్న శ్రీనివాసరావు తనను నియమించినందుకు వైసీపీ నేతలు అనిల్‌కుమార్ రెడ్డి, పీవీ సురేష్, మాజీ శాసన సభ్యుడు వాసుపల్లి గణేష్‌కుమార్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

రైల్వే స్టేషన్‌లో గంజాయి పట్టివేత

విశాఖపట్నం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రైల్లో గంజాయి రవాణా చేస్తున్న మహిళను ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బంది పట్టుకుని ఆమె నుంచి రూ.40 వేలు విలువైన ఎనిమిది కేజీల గంజాయి సంచులను స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం ప్లాట్‌ఫామ్‌లపై తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌కు చెందిన లక్ష్మీ కుసుమ (28) గంజాయి రవాణా చేస్తూ దొరికిపోయింది. ఆమెపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించామని రైల్వే పోలీసులు తెలిపారు.

మాధవధారకు త్వరలో జోనల్ కార్యాలయం

▸▸ జ్ఞానాపురం నుంచి తరలింపు
▸▸ పూర్వ మీసేవ భవనానికి హంగులు



జోనల్ కార్యాలయంగా మార్పులు చేస్తున్న మాధవధారలోని పూర్వ మీసేవ భవనం

మాధవధార, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఏళ్లనాటి ప్రతిపాదన ఎట్టకేలకు రూపుదాల్చింది. జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్-5 కార్యాలయాన్ని మాధవధారకు తరలిస్తున్నారు. నియోజకవర్గాల ప్రాతిపదికన జోనల్ కార్యాలయాలు విభజించడంతో విశాఖ ఉత్తర నియోజకవర్గానికి సంబంధించి మాధవధారలో ఏర్పాటు చేస్తున్నారు. ఆర్టీఏ కార్యాలయ రోడ్డులోని పూర్వ మీసేవ భవనంలోనే తాత్కాలిక కార్యాలయం ఏర్పాటు చేస్తున్నారు. భవనం రెండో అంతస్థులో కొనసాగుతున్న రెండు వార్డు (286, 289) సచివాలయాలను ఖాళీ చేయించి జోనల్ కార్యాలయానికి అవసరమైన మార్పులు చేస్తున్నారు. మరుగుదొడ్లు, జెడ్సీ చాంబర్, విభాగాల వారీగా అధికారులకు ప్రత్యేక ఆసనాల్ని ఏర్పాటు చేస్తున్నారు. ఈ నెలాఖరుకు జ్ఞానాపురం నుంచి కార్యాలయాన్ని ఇక్కడకు తరలించేందుకు పనులు వేగంగా జరుగుతున్నాయి. జెడ్సీ బి.రాము కార్యాలయ పనులను పరిశీలించి ఇంజనీరింగ్ సిబ్బంది, కాంట్రాక్ట్ సిబ్బందికి సూచనలు చేశారు.

శాశ్వత భవనమూ ఇక్కడే

ఆర్‌అండ్‌బీ జంక్షన్ హైవే రోడ్డును ఆనుకొని జియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ) భవనాన్ని ఆనుకొని ఉన్న ప్రభుత్వ స్థలంలో కొత్త జీవీఎంసీ కార్యాలయం నాలుగు అంతస్థులుగా నిర్మిస్తున్నారు.




కార్యాలయం లోపల ఏర్పాటు చేసిన చాంబర్లు

2024 ఫిబ్రవరిలో ఆరంభమైన పనులు నిధుల విడుదలలో జాప్యంతో నెమ్మదించాయి. దిగువ సెల్లార్ పార్కింగ్‌తో జి ప్లస్ 3 భవనంగా కొత్త కార్యాలయం రూపుదిద్దుకుంటోంది. ఈ పనులు పూర్తయ్యే వరకు పూర్వ మీసేవ భవనంలోనే కార్యకలాపాలు కొనసాగనున్నాయి. నవంబరు మొదటి వారం నుంచి మాధవధార నుంచే సేవలందించేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

జగదాంబ జంక్షన్‌లో సూపర్‌స్టార్ కృష్ణ విగ్రహం

▸▸ అనుమతి లేకుండానే ఏర్పాటు
▸▸ అభిమానుల ఉత్సాహం.. స్థానికుల విస్మయం

మహారాణిపేట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): జగదాంబ జంక్షన్‌లో రాత్రికి రాత్రి సూపర్‌స్టార్ కృష్ణ విగ్రహం ఏర్పాటైంది. ఆదివారం తెల్లవారు జామున జంక్షన్‌లో ఘట్టమనేని కృష్ణ విగ్రహం చూసి స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. గ్రేటర్ విశాఖ సిటీ వైడ్ సూపర్‌స్టార్ కృష్ణ, మహేష్ బాబుల సరస్వతీ పార్కు కమిటీ అభిమానుల ఆధ్వర్యంలో విగ్రహాన్ని ఏర్పాటు చేసి మెడలో పూలమాల కూడా వేశారు. ఈ విగ్రహం ఏర్పాటుకు జీవీఎంసీ, ఇతర ఏ ప్రభుత్వ శాఖల నుంచి ఎలాంటి అనుమతులు లేవు. కృష్ణ మరణించాక విగ్రహం ఏర్పాటు చేసేందుకు ఏడాది కాలంగా కలెక్టరేట్, జీవీఎంసీ అధికారుల అనుమతి కోరుతూ పత్రాలు సమర్పించారు. కానీ ఇప్పటి వరకు అనుమతులు ఇవ్వలేదు. బీచ్‌రోడ్డులో సైతం కృష్ణ విగ్రహం ఏర్పాటు చేయాలని అభిమానులు ఆశించినా, అందుకు అవసరమైన అనుమతులు సుప్రీంకోర్టు నుంచి రావలసి ఉన్నందున అక్కడ విగ్రహం ఏర్పాటు కష్టంగా మారింది. అయితే త్వరలోనే కృష్ణ రెండో వర్ధంతి సమీపిస్తున్న తరుణంలో కృష్ణ, మహేష్ బాబుల అభిమానులు ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేసుకున్నారు. అనుమతులు పొందకుండా అనధికారికంగా విగ్రహం ఏర్పాటు చేయటంపై అధికారులు ఎలా స్పందిస్తారో వేచి చూడాలి.



రాత్రి వేళ ఏర్పాటు చేసిన విగ్రహం

ముగిసిన కళాకారుల శిక్షణ తరగతులు



కళాకారులకు సూచనలు చేస్తున్న నాయకులు

కంచరపాలెం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక బీఎస్ఆర్ భవనంలో ప్రజా నాట్యమండలి ఆధ్వర్యంలో ఈ నెల 24న ప్రారంభించిన రాష్ట్ర స్థాయి కళాకారుల శిక్షణ తరగతులు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా జిల్లా ప్రజా నాట్యమండలి కార్యదర్శి, అధ్యక్షుడు ఎం.చంటి, జి.రమణ మాట్లాడారు. ఉత్తరాంధ్ర నుంచి అధిక సంఖ్యలో కళాకారులు పాల్గొనడంతో అభినందించారు. శిక్షణలో భాగంగా సాంస్కృతిక రంగంలో హిందూత్వ దాడి, అభ్యుదయ సాంస్కృతిక ఉద్యమం ప్రజామండలి చరిత్ర, వర్తమాన రాజకీయాలు తదితర అంశాలపై చర్చించారు. గతించిన పోరాట యోధులు జి.సన్యాసిరావు, రమణారావుల చిత్రపటాలకు నాయకులు రాంభూపాల్, అనిల్‌కుమార్‌లు నివాళులర్పించారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేసే జానపద కళాకారులను తయారు చేయడమే లక్ష్యంగా తరగతులు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి 50 మంది కళాకారులు పాల్గొన్నారు.

ఏయూ పూర్వ ఆచార్యులకు ఘన సత్కారం



సమావేశంలో మాట్లాడుతున్న పూర్వ ఉపకులపతి ఆచార్య కె.సి.రెడ్డి

సీతంపేట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వ కళాపరిషత్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో విశాఖ రసజ్ఞ వేదిక ఆధ్వర్యంలో ఆదివారం సారస్వత నీరాజనం (ఆంధ్ర విశ్వవిద్యాలయ పూర్వ ఆచార్యులకు సత్కారం) కార్యక్రమాన్ని నిర్వహించారు. వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ గండికోట రఘురామారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆర్జీయూకేటీ పూర్వ ఉపకులపతి ఆచార్య కె.సి.రెడ్డి మాట్లాడుతూ ఏయూ చరిత్ర చాలా ఘనమైనదన్నారు. ఈ కార్యక్రమంలో ఆచార్యులు వి.బాలమోహన్ దాస్, ప్రొఫెసర్లు ఆర్.మాధవి, కె.నిరూపారాణి, ఎస్.రామకృష్ణారావు, ఎంఎస్ ప్రసాదరావు, ఎస్వీ సుధాకర్, జానకిరావు, సోమసుందరరావు, గౌరి రామమోహన్‌లు విచ్చేసి తమ అనుబంధాన్ని పంచుకున్నారు. నిర్వాహకులు ఆచార్యులను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ శాంతమ్మ, గీతం వైస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ గంగాధరరావు, ప్రొఫెసర్ హరినారాయణ, ప్రొఫెసర్ అవధాని, ప్రొఫెసర్ సి.జి.రామారావు, ప్రొఫెసర్ శశిప్రభ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గురుగ్రంథ్ సాహెబ్ ప్రార్థనలు

సీతంపేట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): గురుద్వారలో గురునానక్ 556వ జయంతి వేడుకలను ఆదివారం ఉత్సాహంగా నిర్వహించారు. గురుద్వార మందిరంలో సిక్కులంతా కలిసి ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు గురుగ్రంథ్ సాహెబ్‌కు ప్రార్థనలు చేశారు. ఇందులో నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి సిక్కు పెద్దలతో కలిసి పాల్గొన్నారు. మధ్యాహ్నం గురు గ్రంథ్‌సాహెబ్‌ను గురుద్వారా అధ్యక్షులు, సిక్కు పెద్దలు తలపై పెట్టుకొని నగర కీర్తనలో భాగంగా ట్రాలీ లారీపై పెట్టి ప్రార్థనలు చేశారు. ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు, నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చిలు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఆర్టీసీ కాంప్లెక్స్ మీదుగా సిరిపురం, బీచ్ రోడ్డు గుండా గురుద్వార కూడలిలోని గురుద్వార మందిరానికి చేరుకుంది. గురుద్వార సత్‌సంఘ్ అధ్యక్షుడు డాక్టర్ డి.ఎస్. ఆనంద్ పర్యవేక్షణలో కార్యక్రమం నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.



నగర కీర్తనను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, సీపీ శంఖబ్రత బాగ్చి

దంతాల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం



మురళీనగర్‌లో దంత వైద్య పరీక్షలు



శ్రామికనగర్‌లో పరీక్షలు చేస్తున్న వైద్యులు

మురళీనగర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మురళీనగర్ వాకర్స్‌పార్క్ కళావేదిక వద్ద ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. నగరానికి చెందిన డెంటల్ హౌస్ వైద్యురాలు వై.నిషా, ఇతర ప్రతినిధులు ఉచిత సేవలందించారు. దంతాలను పరిశుభ్రంగా ఉంచుకుని, ఏడాదిలో ఒక్కసారైనా వైద్య పరీక్షలకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. అశ్రద్ధతోనే చాలామందిలో దంతాలు పూర్తిగా పాడైన స్థితికి చేరుతాయన్నారు. చిగుళ్ల సమస్యను నియంత్రించేలా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. రోగులకు ముందుగా అధిక రక్తపోటు, చక్కెరవ్యాధి పరీక్షలు చేసిన అనంతరం దంతాల ఆరోగ్య పరీక్షలు చేపట్టి వైద్య సలహాలిచ్చారు. అవసరమైన మందులు అందించారు. వాకర్స్‌క్లబ్ అధ్యక్షుడు ఎస్.భానుప్రకాష్ పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో వైద్యులు వందన గౌతమ్, ఎ.లేఖ సేవలందించారు. వాకర్స్‌క్లబ్ కార్యవర్గ సభ్యులు నిర్వహణ ఏర్పాట్లు చేపట్టారు.

శ్రామికనగర్‌లో ఉచిత వైద్యశిబిరం

అక్కయ్యపాలెం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి):ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా నేషనల్ మెడికోస్ ఆర్గనైజేషన్, సేవా భారతి ఆధ్వర్యంలో ఆదివారం 44వ వార్డు శ్రామికనగర్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. స్థానికులకు వైద్యాధికారిణి డాక్టర్ బిందు భార్గవి, ఆంధ్ర వైద్య కళాశాల విద్యార్థులు వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ 44వ వార్డు అధ్యక్షురాలు మళ్లా లక్ష్మి, నాయకులు వెంకటరావు, భాస్కరరావు, సీతారాం, సంఘ సేవకుడు వీవీ రాజు పాల్గొన్నారు.

అధ్వానంగా గ్రీన్‌బెల్ట్ బుద్ధుడు పార్కు

అక్కయ్యపాలెం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): నాలుగ్గు లేన్ల రహదారికి ఆనుకుని ఉన్న గ్రీన్‌బెల్ట్ బుద్ధుడు పార్కు అధ్వానంగా తయారైంది. నాగుల చవితి పేరిట వివిధ ప్రాంతాల ప్రజలు పార్కులోకి వచ్చి పుట్టలో పాలు, గుడ్లు తదితర వస్తువులు వేసి చాలా అధ్వానంగా వేశారు. పార్కులో పుట్టలు లేకపోయినా తవ్వి ఆ గోతిలో గుడ్లు, పాలు పోశారు. అక్కడే బాణసంచా కాల్చి, వివిధ రకాల వస్తువులను కూడా అక్కడే వదిలి వెళ్లారు. దీంతో ఆ పార్కు అస్తవ్యస్తంగా ఉందని స్థానికులు చెబుతున్నారు. ఈ పార్కులో భద్రత లేకపోవడంతో ఇష్టానుసారంగా వ్యవహరించడంపై పలువురు మండిపడుతున్నారు. పార్కులో చెత్తను తొలగించకుండా అక్కడే వదిలేయడంతో సేద తీరుదామని వెళ్లినవారు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. జీవీఎంసీ అధికారులు స్పందించి పార్కులో చెత్తను తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



పార్కులో చిందరవందరగా పారేసిన చెత్త

ఐరెన్ ట్యాబ్లెట్లు మింగేసిన చిన్నారిని కాపాడిన వైద్యులు

మహారాణిపేట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రెండేళ్ల చిన్నారి పొరపాటున సుమారు 20 ఐరెన్ ట్యాబ్లెట్లు మింగేసింది. ట్యాబ్లెట్లు లేకపోవడాన్ని గుర్తించిన తల్లిదండ్రులు హుటాహుటిన చిన్నారిని ఆసుపత్రికి తరలించడంతో వైద్యులు అత్యవసర చికిత్స అందించి ఆమె ప్రాణాలు కాపాడారు. మహారాణిపేటలోని ఉమెన్ అండ్ చైల్డ్ మెడికవర్ పీడియాట్రిక్ వైద్యులు సాయి సునీల్ కిషోర్ ఆదివారం తెలిపిన వివరాల ప్రకారం.. అనకాపల్లి ప్రాంతానికి చెందిన చిన్నారి, ఆమె తల్లి ఐరెన్ ట్యాబ్లెట్లు వేసుకోవటం చూసేది. అనుకోకుండా దొరికిన ట్యాబ్లెట్లు చిన్నారి కంటపడడంతో ఒక్కసారిగా మింగేసింది. ఆ సమయంలో తల్లిదండ్రులు లేకపోవటంతో గమనించలేదు. తరువాత వచ్చినవారు పాప అలసటగా శ్వాస తీసుకోవటంలో ఇబ్బంది పడుతున్న విషయాన్ని గమనించారు. ట్యాబ్లెట్లు తినేసినట్లు గుర్తించారు. వెంటనే స్థానిక వైద్యుని వద్దకు తీసుకెళ్లగా ప్రమాదకర పరిస్థితిలో ఉందని, వెంటనే మెరుగైన ఆసుపత్రికి తరలించాలని సూచించడంతో వెంటనే విశాఖలోని మెడికవర్ ఉమెన్ చైల్డ్ ఆసుపత్రికి తీసుకొచ్చారు. పీడియాట్రిక్ ఇంటెన్సివ్ కేర్ వైద్యులు రక్తపరీక్షలు నిర్వహించి, ఐరెన్ ప్రమాదకర స్థాయిలో ఉన్నట్లు గమనించారు. కాలేయం, ఊపిరితిత్తులు తీవ్రంగా దెబ్బతినటం ప్రారంభించాయి. ఆక్సిజన్ సహాయంతో వెంటిలేటర్ ద్వారా చికిత్స ప్రారంభించారు. కీలేషన్ థెరపీ ద్వారా తొలుత రక్తంలో ఐరెన్‌ను తొలగించారు. నిరంతర వైద్య పర్యవేక్షణలో చికిత్స అందించిన వైద్యులు చిన్నారి పూర్తిగా కోలుకోవటంతో ఆదివారం డిశ్చార్జి చేశారు. చిన్నారి ఆరోగ్యంతో ఇంటికి వెళ్లడం ఆనందంగా ఉందని వైద్యులు పేర్కొన్నారు.



కోలుకున్న చిన్నారితో వైద్యబృందం

ఇంగ్లండ్ జోరు

... 5వ పేజీ తరువాయి

ఇంగ్లండ్ 29.2 ఓవర్లలో కేవలం రెండు వికెట్లు నష్టపోయి ఛేదించింది. ఓపెనర్ అమీ జోన్స్ 75 బంతుల్లో 5 బౌండరీలు, 1 సిక్సర్‌తో అర్ధసెంచరీ పూర్తి చేసింది. మరో ఓపెనర్ టామీ బ్యూమౌంట్ 40 పరుగులు చేసి తహు బౌలింగ్‌లో ఎల్బీడబ్ల్యూగా అవుటైంది. హీదర్ నైట్ (33; 2 ఫోర్లు, 1 సిక్సర్) చెలరేగింది. అప్పటికే వికెట్ల ముందు పాతుకుపోయిన అమీ జోన్స్ రోజ్‌మెయిర్ బౌలింగ్‌లో మిడ్ వికెట్, మిడాఫ్ మీదుగా వరుసగా రెండు ఫోర్లు బాది మ్యాచ్‌ను ముగించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ దిగిన న్యూజిలాండ్ 38.2 ఓవర్లలో 168 పరుగులకు ఆలౌటైంది. టాప్ ఆర్డర్‌లో జార్జి ప్లిమ్మర్ (43), అమెలియా కెర్ (35), కెప్టెన్ సోఫీ డివైన్ (23) మినహా మిగిలిన వారు విఫలమయ్యారు. మ్యాచ్ ఎనిమిదో ఓవర్‌లో స్మిత్ బౌలింగ్‌లో అమెలియా కెర్ (35) బ్యాక్‌వర్డ్ పాయింట్, స్క్వేర్ లెగ్, మిడాఫ్, కవర్స్ మీదుగా వరుసగా నాలుగు బౌండరీలు బాది ఊపుమీద కనిపించినా తర్వాత ఓవర్‌లో క్యాప్సీ బౌలింగ్‌లో డీన్ క్యాచిచ్చి అవుటవడంతో మిగిలిన బ్యాటర్లు వరుసగా పెవిలియన్‌కు క్యూ కట్టారు. ఇంగ్లండ్ బౌలర్లలో లిన్సీ స్మిత్ మూడు వికెట్లు .... బ్రంట్, కాప్సీ చెరో రెండు వికెట్లు...సోఫీ, చార్లీ డీన్ చెరో వికెట్ తీశారు.

పెట్టుబడిదారుల సదస్సుకు నగరం ముస్తాబు

... 5వ పేజీ తరువాయి

పెదవాల్తేరు కరకచెట్టు పోలమాంబ ఆలయం వరకు రోడ్డు మధ్యలోని డివైడర్‌కు రంగులు, ఇరువైపులా ఉన్న గోడలపై పెట్టుబడిదారుల సదస్సుకు సంబంధించిన లోగోలు, నినాదాలతో అద్భుతమైన కళాకృతులను తీర్చిదిద్దుతున్నారు. దీంతో ఆమార్గం నూతనశోభను సంతరించుకుంది. సిరిపురం జంక్షన్ నుంచి ఆశీల్‌మెట్ట తెలుగుతల్లి ఫ్లైఓవర్ మార్గంలో వేమనమందిరం వద్ద కొత్తగా సర్కిల్‌ను నిర్మించి, సంపత్‌వినాయగర్ ఆలయం లాండ్‌మార్క్ స్ఫురించేలా వినాయకుడి విగ్రహాన్ని ఏర్పాటుచేయడంతో సరికొత్త అందం ఆవిష్కృతమయింది. నగరంలో ఎటు చూసినీ సీఐఐ సదస్సుకు సంబంధించిన అభివృద్ధి, సుందరీకరణ పనులే జోరుగా సాగుతున్నాయి.

పెందుర్తి వీఆర్వోపై దాడి

... 5వ పేజీ తరువాయి

వీఆర్వో ఆనంద్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై సీఐ సతీశ్‌కుమార్ విచారణ చేపట్టారు. వీఆర్వోపై దాడి జరిగిందని తేలడంతో పెతకంశెట్టి నాగరాజు, పెతకంశెట్టి సూరిబాబు, పెతకంశెట్టి సురేశ్‌లను అదుపులోకి తీసుకున్నారు. ప్రభుత్వ ఉద్యోగి విధులకు ఆటంకం కలిగించడంతో పాటు, ఆక్రమణల తొలగింపును అడ్డుకుని అతనిపై దాడికి పాల్పడడంతో ముగ్గురు నిందితులపై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

ముంచుకొస్తున్న మొంథా

... 5వ పేజీ తరువాయి

కలెక్టర్ ప్రకటించారు. ఈ విషయాన్ని అర్జీదారులు గమనించాలని కోరారు. వచ్చే సోమవారం యథావిధిగా కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఇక జీవీఎంసీలో ప్రతి సోమవారం నిర్వహించే పీజీఆర్ఎస్‌ను రద్దుచేసినట్టు జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ ప్రకటించారు. అధికారులు, సిబ్బంది తుఫాన్ ముంతస్తు చర్యల్లో నిమగ్నమై ఉంటారని, ఈ నేపథ్యంలో పీజీఆర్ఎస్‌ను రద్దు చేశామని వివరించారు.

ఏయూలో తరగతులు రద్దు

తుఫాన్ నేపథ్యంలో ఆంధ్ర విశ్వవిద్యాలయంలో అన్ని తరగతులను ఈ నెల 27, 28 తేదీల్లో రద్దు చేస్తున్నట్టు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.రాంబాబు ఒక ప్రకటనలో తెలిపారు. హాస్టల్స్‌లో ఉండే విద్యార్థులు గదులకే పరిమితం కావాలని, అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని సూచించారు.

31 వరకు పర్యాటక ప్రాంతాలు మూసివేత

పాడేరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ నేపథ్యంలో ఈ నెల 28 నుంచి 31వ తేదీ వరకు జిల్లాలోని పర్యాటక ప్రదేశాలను మూసివేయాలని అధికారు లను అల్లూరి సీతారామారాజు జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ ఆదేశించారు. జలపాతాల వద్దకు పర్యాటకులు రాకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు.

ఆర్టీసీ అలర్ట్

... 5వ పేజీ తరువాయి

కాకినాడ, రాజమండ్రి, శ్రీకాకుళం, విజయనగరం వెళ్తుంటాయి. కాగా అగ్ని ప్రమాద సంఘటనలకు షాట్ సర్క్యూట్ కారణమని తేలుతోంది. దీంతో ఆయా ప్యానల్స్, వైరింగ్‌ను ఎలక్ట్రికల్ ఇంజినీర్లు పరిశీలించారు.

డ్రైవర్లకు పరీక్షలు

బస్సుల లోపాలు సరిచేసిన అధికారులు ఏసీ బస్సుల డ్రైవర్ల గత రికార్డులను పరిశీలించారు. శారీరక, మానసిక ఆరోగ్యపరిస్థితి, కంటి చూపు, తదితర వైద్యపరీక్షలు నిర్వహించారు. గతంలో హెల్త్ రిపోర్టులు పరిశీలించారు. 45 సంవత్సరాల లోపు వయసు, డ్రైవింగ్‌లో సీనియారిటీ, ఏకాగ్రత ఉన్న డ్రైవర్లను ఎంపిక చేశారు. మద్యం అలవాటులేనివారిని గుర్తించి వినియోగించారు.

నిర్దేశిత వేగం మించొద్దు

బస్సుల తనిఖీ అనంతరం రీజనల్ మేనేజర్ బి.అప్పల నాయుడు ఏసీ సర్వీసుల డ్రైవర్లతో సమావేశమై నిర్దేశిత వేగానికి మించి బస్సులను నడపొద్దని సూచించారు. సాంకేతికలో లోపం గుర్తించినా, విద్యుత్ విభాగంలో లోపాలున్నా సాంకేతిక నిపుణులతో సరిచేయించుకున్న తరువాతే బస్సు నడపాలన్నారు.

టీచర్లకూ టెట్

... 5వ పేజీ తరువాయి

సబ్జెక్టుల్లోని కొన్ని కీలక పాఠ్యాంశాలపై అవగాహన ఉండదు. ప్రాథమిక పాఠశాలల్లో బోధించే ఎస్జీటీ, భవిష్యత్తులో పదోన్నతి కోరుకుంటే లెవెల్-2 పరీక్ష రాయాలి.

ఉమ్మడి జిల్లాలో పది వేల మంది

ఉమ్మడి విశాఖ జిల్లాలో ప్రభుత్వ, జిల్లా పరిషత్, మునిసిపల్, గిరిజన సంక్షేమ శాఖ, గురుకులాల్లో సుమారు 15 వేల మందికి పైగా ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. వీరిలో 2014కు ముందు నియమితులైన, టెట్ రాయాల్సిన టీచర్లు నది వేల మంది వరకూ ఉంటారని అంచనా వేస్తున్నారు. 2014 తరువాత మూడు డీఎస్సీలు నిర్వహించారు. వీరంతా టెట్ అర్హత సాధించిన తరువాతే డీఎస్సీ ద్వారా ఎంపికై ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. వారు ఇప్పుడు కొత్తగా టెట్ రాయాల్సిన అవసరం లేదు. 2014కు ముందు పలు డీఎస్సీల ద్వారా ఎంపికై 1968 ఆగస్టు 31 తరువాత పుట్టినవారు, 2030 ఆగస్టు 31 తరువాత పదవీ విరమణ చేయనున్న టీచర్లు టెట్ అర్హత సాధించాలి. ఓపెన్ కేటగిరీ అయితే 90 మార్కులు, బీసీ అభ్యర్థులు 75 మార్కులు, ఎస్సీ/ఎస్టీలు 60 మార్కులు సాధించాలి. రెండేళ్లు అంటే 2027 సెప్టెంబరు నెలాఖరులోగా టెట్ అర్హత సాధించాలి. టీచర్లు టెట్ రాయాలని ఆదేశించడంపై ఎస్టీటీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇమంది పైడిరాజు అభ్యంతరం తెలిపారు. ప్రభుత్వం స్పందించి సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వేయాలని కోరారు.

పోరు ఉధృతం

... 5వ పేజీ తరువాయి

తీసుకున్న తరువాత సమ్మె విరమించే యోచనలో ఆస్పత్రుల యాజమాన్యాలు ఉన్నట్టు చెబుతున్నారు.

విరమణ యోచనలో కొన్ని..

జిల్లాలో 65 ప్రైవేటు/ కార్పొరేట్ నెట్‌వర్క్ ఆస్పత్రులు ఉన్నాయి. వీటిలో 32 ఆస్పత్రులు సమ్మెలో ఉన్నాయి. మరికొన్నింటిలో సాధారణ, అత్యవసర వైద్య సేవలను అందిస్తున్నారు. కాగా సమ్మెలో ఉన్న కీలక ఆస్పత్రుల్లో కొన్ని వైద్య సేవలు అందించేందుకు సిద్ధపడుతున్నట్టు చెబుతున్నారు. ఇప్పటికే నాలుగు ఆస్పత్రులు రెండు రోజులుగా కొత్తరోగులను చేర్చుకుంటున్నాయని అధికారులు చెబుతున్నారు. మరో మూడు ఆస్పత్రులు సోమవారం నుంచి సేవలు ప్రారంభిస్తాయంటున్నారు. జిల్లాలో ప్రస్తుతం 26 ఆస్పత్రులు మాత్రమే పూర్తిగా సమ్మెలో ఉన్నాయన్నారు.

ఇదే అదనుగా దోపిడీ..

సమ్మెలో ఉన్నప్పటికీ కేన్సర్, కిడ్నీ బాధితులకు వైద్య సేవలను కొనసాగించాలి. అయితే జిల్లాలోని కొన్ని ఆస్పత్రులు డయాలసిస్‌కు వస్తున్న రోగుల నుంచి భారీగా ఫీజులను వసూలు చేస్తున్నాయి. సమ్మె నేపథ్యంలో ఉచిత సేవలు అందించలేమని, డయాలసిస్‌కు రూ.4 వేల వరకు వసూలు చేస్తున్నాయి. కొన్నిచోట్ల కేన్సర్ రోగులకు కీమో, ఇతర థెరపీలకు డబ్బులు వసూలు చేస్తున్నారు. వీటిపై అధికారులు దృష్టి సారించి, చర్యలు తీసుకోవాలని రోగులు కోరుతున్నారు.



ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

గౌరీపరమేశ్వరుల అనుపోత్సవం

అగనంపూడి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డు పరిధి దానబోయినపాలెంలో శనివారం రాత్రి గౌరీపరమేశ్వరుల అనుపోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు గౌరీపరమేశ్వరులను దర్శించుకుని పూజలు చేశారు. మంగళవాయిద్యాలు, కోలాటాల నడుమ గౌరీపరమేశ్వరులను పురవీధుల్లో ఊరేగింపుగా తీసుకువెళ్లి నిమజ్జనం చేశారు. గ్రామ పెద్దలు దుల్ల ఈశ్వరరావు, అమర పిన్ని అప్పారావు, దుల్ల తాతారావు, అర్జున్, దానబాల రాంబాబు, యూత్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

యూజ్ నూతన కార్యవర్గం



నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

ఉక్కుటౌన్‌షిప్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంటులోని యూనియన్ ఆఫ్ స్టీల్ ఎంప్లాయిస్ (యూజ్) నూతన కార్యవర్గాన్ని ఆదివారం టౌన్‌షిప్‌లో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గోకా జగ్గారావు, ఉపాధ్యక్షులుగా రేణంకి సత్యనారాయణ, కేవీజీ రాధాకృష్ణ, కె.రవికుమార్, టి.సూరి నాయుడు, ప్రధాన కార్యదర్శిగా నంబారు అమ్మన్న, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా అచ్చిబాబు, కోశాధికారిగా ఎస్.శేషాచలంలతో పాటు మరికొంతమంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నకయ్యారు. ఈ సందర్భంగా మాజీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కామేశ్వరరావు, కె.పరంధామయ్య మాట్లాడుతూ స్టీల్‌ప్లాంటులో ఉద్యోగుల సమస్యలపై యూజ్ నిరంతరం కృషి చేస్తుందన్నారు.

సీఐటీయూ భెల్ అధ్యక్షుడిగా విజయకుమార్

అక్కిరెడ్డిపాలెం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): సీఐటీయూ భెల్ హెచ్‌పీవీపీ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. భెల్ టౌన్‌షిప్‌లో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్కేఎస్‌వీ కుమార్ సమక్షంలో నూతన అధ్యక్షుడిగా కె.విజయకుమార్‌ను ఎన్నుకున్నారు. అలాగే ప్రధాన కార్యదర్శిగా జీటీపీ ప్రకాశ్, కోశాధికారిగా కె.నారపరెడ్డి, ప్రచార కార్యదర్శిగా ఎస్.జగన్నాథరావు ఎన్నికయ్యారు.

సమస్యలను పరిష్కరించాలని వినతి

ఉక్కుటౌన్‌షిప్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంటులో విధులు నిర్వహిస్తున్న అధికారుల ప్రధాన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఢిల్లీలో ఉక్కు మంత్రిత్వశాఖ అధికారులు, కార్మికశాఖ అధికారులను కలిసి వారు విజ్ఞప్తి చేశారు. అలాగే బీజేపీ నాయకుడు, మాజీ ఎంపీ జీవీఎల్ నరసింహరావుకు ఆదివారం ఢిల్లీలో వినతిపత్రం అందజేశారు. పదోన్నతులు కల్పించాలని, పెండింగ్ వేతన బకాయిలు ఇవ్వాలని, గ్యాట్యుటీ పెంచాలని, ప్రభుత్వ ఉక్కు రంగ పరిశ్రమలను ఏకీకరణ చేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఉక్కు అధికారుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు చంద్రరావు, కేవీడీ ప్రసాద్, ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావు ఉన్నారు.

సినిమా గైడ్

- **బైసన్** : శారదా,
- **తమ్మా** : రమాదేవి
- **డూడ్** : శరత్, శ్రీరామా, లీలామహల్, శ్రీకన్య, ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం), లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)
- **క్రాంప్** : సంగం, కామేశ్వరి, వెంకటేశ్వర-1, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం),
- **ఓజీ** : కిన్నెర, కామేశ్వరి, శ్రీకన్య హెవెన్-3, మినీ మోహిని (గాజువాక), శ్రీకాంతి, సుకన్య,
- **మిరాయి** : సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 17, టమాటా 34, వంకాయలు (తెలుపు) 50, వంకాయలు (నలుపు) 50, బెండకాయలు 36, పచ్చిమిర్చి 38, కాకరకాయలు 34, బీరకాయలు 36, ఆనపకాయ 24, కాలీఫ్లవర్ 40, క్యాబేజి 26, క్యారెట్ 66, దొండకాయలు 42, బంగాళదుంపలు 20, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 78, అల్లం (పాతది) 70, బరబాటి 40, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 50, బద్దచిక్కుడు 66, దోస కాయలు 28, వెల్లుల్లి (పెద్దవి) 65, కొబ్బరికాయ (పెద్దది) 40, బీన్స్ (పెన్సిల్) 70, కీర దోస 20, కాప్సికమ్ 70, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 34, చిలగడదుంపలు 36, కంద 48, దేముడు చిక్కుడు 76, గోరు చిక్కుడు 42, కూర పెండలం 36, బ్రకోలి 45, పనసపొట్టు 200, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 22, మామిడి అల్లం 90, బొప్పాయి 32, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	560
విజయనగరం	564
శ్రీకాకుళం	564

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	115
లైవ్ ధర	135
విత్ స్కిన్	240
స్కిన్‌లెస్	250

హత్య కేసులో నిందితుల అరెస్టు

- సెల్ ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా గుర్తించిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన డీసీపీ లతామాధురి



విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ (క్రైమ్) లతామాధురి

గాజువాక, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): గాజువాక ఆటోనగర్‌లో లారీ డ్రైవర్‌ను హత్య చేసిన నిందితులను పోలీసులు అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. ఈ మేరకు గాజువాక పోలీస్ స్టేషన్‌లో ఆదివారం జరిగిన విలేకర్ల సమావేశంలో డీసీపీ (క్రైమ్) లతామాధురి వివరాలు వెల్లడించారు.

ఛత్తీస్‌గఢ్ నుంచి విశాఖ స్టీల్‌ప్లాంటుకు అల్యూమినియం లోడుతో డ్రైవర్ మీరాజ్ హుస్సేన్ (35) ఈ నెల 10న బయలుదేరాడు. రాయగడ కేరడా చెక్‌పోస్ట్ వద్ద ఛత్తీస్‌గఢ్‌లోని మహాసముంద్ జిల్లా సరైపాలి గ్రామానికి చెం దిన ఇంద్రపాల్‌సింగ్ రాజ్‌పుత్ (27), రతీనాయక్ (25) విశాఖ వచ్చేందుకు లారీ ఎక్కారు. లారీ 11న అర్ధరాత్రి ఆటోనగర్ చేరుకుంది. అక్కడ పార్క్ చేసి లారీలోనే ముగ్గురూ మద్యం సేవించారు. అనంతరం డ్రైవర్ హుస్సేన్ తలపై ఇంద్రపాల్‌సింగ్ రాజ్‌పుత్ ఇనుప రాడ్డుతో బలంగా కొట్టడంతో మృతి చెందాడు. అనంతరం హుస్సేన్ వద్ద నగదు, సెల్‌ఫోన్, రిస్ట్ వాచ్‌లను తీసుకని నిందితులు దువ్వాడ రైల్వేస్టేషన్‌కు చేరుకుని, రైల్లో ఛత్తీస్‌గఢ్ వెళ్లిపోయారు.

ఇదిలావుండగా 15వతేదీ వచ్చినా లారీ ప్లాంటుకు చేరుకోకపోవడంతో యజమాని జీపీఎస్ ద్వారా లొకేషన్ గుర్తించి, మృతుడి సోదరుడు నజీబ్ హుస్సేన్‌ను విశాఖ పంపించాడు. అతడు వచ్చి చూడగా లారీలో హుస్సేన్ (35) మృతదేహం కనిపించింది. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

సెల్ ఫోన్ లొకేషన్ ఆధారంగా ..

మృతిచెందిన డ్రైవర్ మీరాజ్ హుస్సేన్ సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఛత్తీస్‌గఢ్‌లో ఉన్నట్టు గుర్తించిన గాజువాక పోలీసులు ప్రత్యేక బృందంతో వెళ్లి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా ఇంద్రపాల్‌సింగ్ రాజ్‌పుత్ ఈ నెల 10న ఒడిశా సబల్‌పూర్‌లో ఓ వృద్ధుడ్ని హత్య చేసి రూ.5 వేల నగదు, సెల్‌ఫోన్ చోరీ చేశాడని తేలింది. అంతేకాకుండా ఒడిశా రాష్ట్రంలో పలు చోరీలు, మహిళల పట్ల అసభ్యకర ప్రవర్తన కేసుల్లో నిందితుడని గుర్తించారు. అతడ్ని అప్పగించేందుకు స్థానిక పోలీసులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో సీపీ శంఖబ్రతబాగ్చి ఉన్నతాధికారులతో మాట్లాడడంతో అప్పగించారు. సమావేశంలో ఏసీపీ వైశ్రీనివాసరావు, సీఐలు పార్థసారధి, శ్రీనివాసరావు పాల్గొన్నారు. కేసు ఛేదించిన ఎస్ఐ హరికృష్ణను అధికారులు అభినందించారు.



కొనుగోలుదారులు పెద్దగా లేక ఖాళీగా దర్శనమిస్తున్న గాజువాక చేపల మార్కెట్

వెలవెలబోయిన మాంసం, చేపల మార్కెట్

- కార్తీక మాసం ఎఫెక్ట్
- రైతు బజారుకు కొనుగోలుదారుల తాకిడి

గాజువాక, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం నేపథ్యంలో ఆదివారం గాజువాకలోని మాంసం దుకాణాలు, చేపల మార్కెట్‌లు కొనుగోలుదారులు లేక వెలవెలబోగా... మహిళా రైతుబజార్ కిటకిటలాడుతూ కనిపించింది. ఈ మాసంలో అయ్యప్ప భక్తులతో పాటు ఇళ్లలో కూడా అత్యధికులు కార్తీక నోముల నేపథ్యంలో శాకాహారానికే ప్రాధాన్యం ఇవ్వడంతో కూరగాయల మార్కెట్లకు కొనుగోలుదారుల తాకిడి పెరిగింది. ప్రధానంగా గాజువాక మహిళా రైతు బజారులో ఉదయం ఆరు నుంచి తొమ్మిది గంటల్లోపే కూరగాయలన్నీ అమ్ముడైపోయాయి. ఆ తరువాత వచ్చిన కొనుగోలుదారులకు మార్కెట్‌లో కూరగాయలు దొరక్క వెనుదిరిగిపోయారు. చాలామంది బహిరంగ మార్కెట్లలో కూరగాయలను కొనుగోలు చేశారు. అయితే అక్కడ కూడా కూరగాయలు అంతంతమాత్రమే లభ్యమయ్యాయి. మరోపక్క మాంసం, చేపల విక్రయాలు తగ్గుముఖం పట్టాయని సదరు వాపారులు చెబుతున్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరానికి మంచి స్పందన

అగనంపూడి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక వాకర్స్ క్లబ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అపోలో ఆస్పత్రి సౌజన్యంతో ఆదివారం నడక మైదానం వద్ద ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరానికి మంచి స్పందన వచ్చింది. సుమారు 200 మంది శిబిరంలో వైద్య సేవలు పొందారు. తొలుత ఈ శిబిరాన్ని ప్రారంభించిన తెలుగు మహిళ గాజువాక నియోజకవర్గ అధ్యక్షురాలు గొల్లవిల్లి కనకభవానీ మాట్లాడుతూ ఇక్కడ ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. వాకర్స్ క్లబ్ ప్రతినిధులు ఎం.నరసింగరావు, గుడే సుశీలగజేంద్రరరావు, వి.రాము, కె.పైడిరాజు, రామారావు, చిన్ని పూర్ణ, అప్పారావు, ధర్మారావు, పిళ్లా శ్రీను, హనుమంతరావు, తదితరులు పాల్గొన్నారు.



పతకాలు సాధించిన విద్యార్థులతో ఉక్కు జీఎం మధుసూదనరావు, తదితరులు

విద్యార్థులు సృజనాత్మకతతో ముందుకు సాగాలి

స్టీల్ ప్లాంట్ జీఎం మధుసూదనరావు

ఉక్కుటౌన్‌షిప్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సృజనాత్మకమైన ఆలోచనలతో ముందుకు సాగితే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని స్టీల్ ప్లాంట్ జీఎం ఎం.మధుసూదనరావు అన్నారు. ప్లాంట్ స్టీల్ క్లబ్‌లో మేథ్ టూ మెరిట్ సంస్థ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి అబాకస్ పోటీలను ఆదివారం నిర్వహించారు. ఈ పోటీలను ప్రారంభించిన జీఎం మాట్లాడుతూ ప్రాచీన గణితశాస్త్రం ఆధారంగా అబాకస్ ద్వారా విద్యార్థుల్లో మేథాశక్తి పెంచవచ్చన్నారు. ఈ పోటీల్లో దేశవ్యాప్తంగా సుమారు వెయ్యి మంది విద్యార్థులు పాల్గొనగా, ప్రతిభావంతులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ ఎండీ ఈ.సుధారాణి, ప్రతినిధులు వైకే గార్గ్, ధనుంజయ, తదితరులు పాల్గొన్నారు.

మానసిక ప్రశాంతతకు భగవద్గీత చదవాలి

అక్కిరెడ్డిపాలెం, అక్టోబరు 26 (ఆంధ్ర జ్యోతి): మానసిక ప్రశాంతతకు, మనోవికాసానికి, అందరూ సన్మార్గంలో నడిచేందుకు భగవద్గీత పఠనం ఎంతో ఉపయోగపడుతుందని బీజేపీ గాజువాక ఇన్‌చార్జి కరణంరెడ్డి నరసింగరావు అన్నారు. చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో వెంకటేశ్వరకాలనీలోని బీవీకే పాఠశాలలో ఆదివా రం నిర్వహించిన జిల్లా స్థాయి భగవద్గీత పఠనం పోటీల విజేతలకు ఆయన బహుమతులు అందజేశారు. చిన్మయ మిషన్ సభ్యుడు రఘువీరానందస్వామి మాట్లాడుతూ విద్యార్థుల్లో భగవద్గీత పట్ల అవగాహన కల్పించడంతో పాటు వారు నిత్యం పఠించేందుకు గాను ఈ పోటీలను నిర్వహించామన్నారు. కార్యక్రమంలో మిషన్ సభ్యులు జయంతి, ఎస్‌వీ స్వామి, శ్రీవత్స చైతన్య, జ్యోత్న, జి.శంకరరావు, కె.అప్పలరాజు, యువశ్రీ, తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ప్రసాదుల శ్రీనివాస్, తదితరులు

వైసీపీ దుష్ప్రచారాన్ని ప్రజలు నమ్మరు

టీడీపీ 'గాజువాక' సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్

గాజువాక, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): వైద్య కళాశాలలకు సంబంధించి వైసీపీ చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రజలు నమ్మే స్థితిలో లేరని ఏపీఐఐసీ డైరెక్టర్, టీడీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ అన్నారు. ఇక్కడి పార్టీ కార్యాలయంలో ఆదివారం పీపీపీ విధానం పోస్టరును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద పిల్లలు వైద్యులు కావాలనే దృఢ సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీపీపీ విధానంలో వైద్య కళాశాలలపై వైసీపీ విష ప్రచారం చేస్తుందన్నారు. మెడికల్ కళాశాలలపై వైసీపీ సవతితల్లి ప్రేమ చూపిస్తుందన్నారు. ప్రజలతో ప్రభుత్వం చేసే అభివృద్ధిని గమనిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు, రాష్ట్ర గ్రీనరీ, బ్యూటిఫికేషన్ డైరెక్టర్ మొల్లి పెంటిరాజు, నాయకులు గణపతి, పెంటయ్య, కుంచారావు, కొండబాబు, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

పేదలైన కాపులకు 12 శాతం రిజర్వేషన్ ఇవ్వాలి

గాజువాక, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పేదలైన కాపులకు 12 శాతం రిజర్వేషన్ సదుపాయాన్ని కల్పించాలని కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చనమల్ల ప్రసాదరావు అన్నారు. ఇక్కడి కర్నవానిపాలెంలోని శ్రీకృష్ణదేవరాయ కల్యాణ మండపంలో ఆదివారం రాష్ట్ర కాపు రిజర్వేషన్ పోరాట సమితి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 27 శాతం ఉన్న కాపులతో పాటు ఉప కులాలైన తూర్పుకాపు, మున్నూరు కాపు, బలిజ, తెలగ, ఒంటరి కులాలకు రెండు తెలుగు రాష్ట్రాల్లో 12 శాతం రిజర్వేషన్ ఇవ్వాలన్నారు. దీనిపై తెలుగు రాష్ట్రాల సీఎంలతో పాటు ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌ను కలిసి వినతిపత్రాలు అందజేస్తామన్నారు. సమావేశంలో అఖిల భారత కాపు సమాఖ్య ఉపాధ్యక్షుడు కరణంరెడ్డి నరసింగరావు, నాయకులు రావి శ్రీనివాసరావు, జి.అప్పారావు, గంధం వెంకటరావు, కె.కనకారావు, వెంకటరమణ, అమ్మన్న, శంకరరావు, అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

మహాత్మాగాంధీ పార్కులో శ్రమదానం



పార్కును శుభ్రం చేస్తున్న తిరుమలనగర్ కాలనీవాసులు

కూర్మన్నపాలెం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 87వ వార్డు పరిధి తిరుమలనగర్ కాలనీలో ఆదివారం స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా మహాత్మాగాంధీ పార్కును శుభ్రపరిచారు. ఈ సందర్భంగా కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు విశ్వేశ్వరరావు, పరమానందం మాట్లాడుతూ పార్కులోని చెత్తాచెదారం, పిచ్చిమొక్కలను జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది సహకారంతో తొలగించామన్నారు. రోడ్లను చీపుర్లతో ఊడ్చి శుభ్రంగా తీర్చిదిద్దామన్నారు. ఇళ్ల పరిసరాల్లో కాలనీవాసులు చెత్తాచెదారాలు వేయకుండా ఉండేలా ప్రతిజ్ఞ చేశామన్నారు. కార్యక్రమంలో ప్రతినిధులు వసంత రెడ్డి, సన్యాసిరావు, రమణ, కోటేశ్వరరావు, అర్జున్, భాస్కరరావు, కృష్ణ, జీవానందం, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి పూజలకు సరిపల్లి సిద్ధం



సరిపల్లిలోని శివాలయంలో స్వయంభు శివలింగం

పెందుర్తి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): లయకారుడు శివుడికి అత్యంత ప్రీతికరమైన కార్తీక మాసం తొలి సోమవారం స్వయంభూ శివాలయ సందర్శన సర్వపాపహరణం. స్వయంభూ శివ లింగం అంటే స్వయంగా జన్మించిన శివుడు. ఇటువంటి మహిమాన్వితమైన శివాలయం పెందుర్తి మండలం సరిపల్లిలో వెలసింది. ఇది ప్రాచీనకాలం నాటిది. శివాలయంలోని గర్భగుడిలో గల స్వయంభూ లింగం అత్యంత శక్తివంతమైనది. ఆధ్యాత్మికంగా ఎంతగానో ప్రసిద్ధి చెందింది. ఆలయ ప్రధాన మందిరంతో పాటు గణేశుడు, పార్వతీదేవి విగ్రహాలు ఉన్నాయి. శివలింగానికి అభిముఖంగా అతి ప్రాచీన కాలం నాటి నందీశ్వరుడి విగ్రహం ఉంది. ఆలయ ప్రాంగణంలో ధ్వజస్తంభం, రావి, మర్రి చెట్లు, నవగ్రహ విగ్రహాలు ఉన్నాయి.

శివలింగానికి భక్తుల పూజలు

సరిపల్లిలోని స్వయంభు శివాలయానికి ఓ విశిష్టత ఉంది. గర్భగుడిలోని లింగానికి భక్తులే పూజలు, అభిషేకాలు చేసుకోవచ్చు. కార్తీక మాసంలో ఈ ఆలయంలో అధిక సంఖ్యలో శివమాలలను భక్తులు ధరిస్తారు. పెద్దసంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉండడంతో ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది.



సరిపల్లిలో శివాలయం

క్షేత్రమహిమ: సరిపల్లిలోని వ్యవసాయ భూముల్లో సాగు చేస్తున్నప్పుడు పొలాల్లో స్వయంభూ లింగం కనిపించిందని పూర్వీకుల కథనం. దీని మహిమను తెలుసుకున్న పొరుగూరు ధనికుడు ఈ లింగాన్ని తన గ్రామానికి తీసుకెళ్లాలని భావించాడు. లింగం వెలసిన ప్రాంతంలో తవ్వకాలు చేపట్టినా ఆది, అంతం కనుగొనలేకపోయారు. దీంతో గ్రామస్తులు స్వయంభు లింగం వెలసిన ప్రదేశంలో ఆలయాన్ని నిర్మించారు. శివలింగం శ్వేతవర్ణంతో మెరుస్తుండటంతో శివపత్ని పార్వతీ దేవి మల్లెపూవు వంటి తెల్లదనం కలిగి ఉండటంతో ఆ వర్ణంతో ఉన్న స్వయంభూ లింగం ఏర్పడడంతో శివాలయానికి మల్లీశ్వరి స్వామి ఆలయంగా పిలుస్తుంటారు.

రెవెన్యూ యంత్రాంగం అప్రమత్తం

మల్కాపురం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ నేపథ్యంలో ములగాడ మండలంలో ఉన్న రెవెన్యూ అధికారులను, సచివాలయాల వీఆర్‌వోలను తహసీల్దార్ రమేష్ నాయుడు అప్రమత్తం చేశారు. శనివారం నుంచే ప్రత్యేక విధులు అప్పగించారు. ఏ క్షణంలో ఎలాంటి విపత్తు సంభవించినా, ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నామని తహసీల్దార్ చెప్పారు. తుఫాన్ ప్రభావం తగ్గేవరకు మండల కార్యాలయంలో ఇద్దరు వీఆర్‌వోలు నిరంతరం అందుబాటులో ఉంటారని తెలిపారు. ఈ నెల 27 నుంచి 30 వరకు ఎవరెవరు ఏయే సమయాల్లో ఉండాలో నిర్దేశించారు. ఎక్కడైనా ప్రమాదం జరిగితే వెంటనే ఆయా వీఆర్‌వోలకు తెలియజేయాలని ప్రజలను కోరుతూ అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

వైసీపీ సంతకాల సేకరణ



సంతకాలు సేకరిస్తున్న వైసీపీ ఇన్‌ఛార్జి అదీప్‌రాజ్, ఇతర నాయకులు

పెందుర్తి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసీపీ చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ఆదివారం చినముషిడివాడలో నిర్వహించారు. వైసీపీ వార్డు అధ్యక్షుడు మొంటి మహేశ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నంరెడ్డి అదీప్‌రాజ్ మాట్లాడుతూ వైద్య కళాశాలలు ప్రైవేటీకరిస్తే పేదలకు వైద్యం భారం అవుతుందని, కార్పొరేట్ సంస్థలు వైద్యాన్ని వ్యాపారం చేస్తాయని పేర్కొన్నారు. అంతకుముందు పలువురి నుంచి సంతకాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ రూరల్ జిల్లా మాజీ అధ్యక్షుడు శరగడం చినఅప్పలనాయుడు, కోడిగుడ్ల దేవిసాంబ, గండి రవికుమార్, కోరాడ చందుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గోపాలపట్నం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా స్థానిక కొత్తపాలెంలోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్వహణ పనులు సోమవారం చేపట్టనున్నారు. సబ్‌స్టేషన్ పరిధిలోని కొత్తపాలెం, నాగేంద్రకాలనీ, డీఏఆర్ నగర్, సంతోష్‌నగర్, ఖారవేల నగర్, చంద్రనగర్, ఎర్రచెరువు, ఆదర్శనగర్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని జోన్-3 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.సింహాచలం నాయుడు తెలిపారు.

ముగిసిన అంతర్ జిల్లా టేబుల్ టెన్నిస్ పోటీలు



టేబుల్ టెన్నిస్ విజేతలతో అతిథులు

గోపాలపట్నం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో రెండు రోజులుగా జరుగుతున్న 69వ అంతర్‌జిల్లా టేబుల్ టెన్నిస్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా విద్యాశాఖాధికారి ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ క్రీడలతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, క్రీడల్లో రాణిస్తే ఉన్నత శిఖరాలు అందుకోవచ్చన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారుల్ని ప్రోత్సహించడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని, వసతుల్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని రాణించాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 500 మంది పాల్గొన్న ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన జట్లకు డీఈవో ప్రేమ్‌కుమార్, టీడీపీ పశ్చిమ నియోజకవర్గ యువజన విభాగం నేత పి.మౌర్యసింహ బహుమతులు అందజేశారు. విజేత జట్లు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. ముగింపు కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో సోమేశ్వరరావు, రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సభ్యులు, ఔత్సాహికులు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్లకు మరో మార్గం ఏర్పాటు చేయాలని సీపీఎం డిమాండ్



ర్యాలీలో పాల్గొన్న సీపీఎం నాయకులు

మల్కాపురం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): అచ్చినాయుడు తోటలో నిర్మించిన టిడ్కో ఇళ్లకు ప్రత్యేక మార్గం ఏర్పాటు చేయాలని కోరుతూ సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు ఆధ్వర్యంలో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ కాలనీకి రోడ్డు కల్పించడంలో భాగంగా అల్లూరి సీతారామరాజు కాలనీ, గుడివాడ అప్పన్న కాలనీలో కొన్ని ఇళ్లు తొలగించేందుకు అధికారులు సిద్ధమైన నేపథ్యంలో ఈ కాలనీలో నిరసన వ్యక్తమైందన్నారు. తామంతా దిగువ కాలనీలకు మద్దతుగా ఉంటామని, అలాగే టిడ్కో ఇళ్ల నివాసదారులకు కూడా మార్గం కల్పించాలని ఆయన కోరారు. ఇళ్లు తొలగిస్తే తీవ్ర నిర్ణయాలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు. ఈ విషయమై జీవీఎంసీ ఎదురుగా సోమవారం ధర్నా చేస్తామని తెలిపారు. ఎమ్మెల్యే పీజీవీఆర్ నాయుడు (గణబాబు) స్పందించి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కర్రయ్య, మహేంద్ర, అర్జునరావు, గణేష్, సురేష్, లెనిన్, జగ్గునాయుడు పాల్గొన్నారు.

సముద్రంలో గల్లంతైన ఎల్లాజీ ఆచూకీ లభ్యం

కాకినాడ జిల్లా జంగంపేట దగ్గర గుర్తింపు

పెదవాల్తేరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) ! సముద్రంలో చేపల వేటకు వెళ్లి శుక్రవారం సముద్రంలో గల్లంతైన పెదజాలారిపేటకు చెందిన మత్స్యకారుడు రామోలు ఎల్లాజీ (28) అచూకీ లభ్యమైంది. అతడు ఆదివారం ఉదయం కాకినాడ జిల్లా తుని మండలం ఉకుంపేట, జంగంపేట దగ్గరలో ఉన్నట్టు సమాచారం అందడంతో ఎల్లాజీని తీసుకొచ్చేందుకు పెదజాలారిపేట నుంచి కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలు ఆదివారం ఉదయం కాకినాడ జిల్లా తుని మండలం ఉకుంపేట, జంగంపేట చేరుకుని ఎల్లాజీని సురక్షితంగా పెదజాలారిపేట తీసుకొచ్చారు. దీంతో అతడి కుటుం బ సభ్యులు, బంధువులు, మత్స్యకారులు ఆనందం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులు పోలీసుస్టేషన్‌కు వెళ్లి అతడు వచ్చిన సమాచారం అందించి గల్లంతైన విషయమై ఇచ్చిన ఫిర్యాదును వాపసు తీసుకున్నారు.

అయ్యప్ప ఆలయంలో నిత్యాన్నదానానికి శ్రీకారం



అన్న ప్రసాదం వడ్డిస్తున్న మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద్ తదితరులు

పెందుర్తి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పెందుర్తిలోని అయ్యప్పస్వామి ఆలయంలో అయ్యప్ప సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో మాలధారణ స్వాములకు మండలం నిత్యాన్నదాన కార్యక్రమానికి ఆదివారం శ్రీకారం చుట్టారు. 41 రోజులు నిర్వహించి డిసెంబరు 6న ముగిస్తారు. ఆదివారం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమాన్ని మేయరు పీలా శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద్ ప్రారంభించారు. మేయరు పీలా శ్రీనివాసరావు మాట్లాడుతూ అయ్యప్ప ఆలయంలో సేవా ట్రస్ట్ ఏటా స్వాములకు అన్నదానం చేయడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా సుమారు రెండు వేల మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

మరిడిమాంబ ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మౌర్యసింహ

మల్కాపురం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ విశాఖ 59వ వార్డు గణపతినగర్‌లో మరిడిమాంబ ఆలయం నిర్మాణ పనులకు పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే పీజీవీఆర్ నాయుడు (గణబాబు) తనయుడు మౌర్యసింహ ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నసమారాధనను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఉరుకూటి హరిబాబు, మితిరెడ్డి శంకర్, దేవర ఈశ్వరరావు, గున్నా అనిల్, బీజేపీ నాయకులు లక్కరాజు రామకృష్ణ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.